నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 21-3-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:179 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

మేదురముగ సంఘమ్మును
సాదరముగ నుంచు కొరకు జరుపవలెను-కా
కోదర శయనుని కృపతో
నాదర మొప్పగ ప్రపంచ యటవీ దినమున్ !!

(మార్చి 21 ప్రపంచ అటవీ దినోత్సవం)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

గతాన్ని తవ్వుకుంటూ
గడిపేస్తే అది వ్యర్థం
కొత్తచూపు భవిష్యత్తుకు
కొనసాగితే పరమార్థం
విశ్వాసం గుడ్డిదైతే
వికాసం దరిచేరదు
భ్రమల్లోనా తేలిపోతే
బ్రతుకు రాత్రి తెల్లారదు

-వేల్పుల నారాయణ
9440433475

పేదోళ్లు, పెద్దోళ్లు తేడా లేదు.. అందరూ 'బిల్డ్ నౌ'లోకి రావాల్సిందే

హైదరాబాద్, మార్చి 20:హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన 'ప్రజా పాలనలో కొలువుల పండుగ' కార్యక్రమంలో పాల్గొని 'బిల్డ్ నౌ' పోర్టల్‌సను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. గతంలో పేదలకు వేరుగా పెద్దలకు వేరుగా నిర్మాణ అనుమతులు ఉండేవని, ఇప్పుడు ఎంత పెద్దోడైనా బిల్డ్ నౌ వెబ్‌సైట్లో అప్లై చేయాల్సిం దేనని సీఎం స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పురపాలక శాఖల్లో కారుణ్య నియామకాలకు సంబంధించి 922 మందికి నియామక పత్రాలు సీఎం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవి చేపట్టడం కన్నా.. జడ్పీటీసీగా విజయం సాధించినప్పుడే ఎక్కువ సంతోషం కలిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటిసారిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. కారుణ్య నియామకాలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. నిరుద్యోగుల బాధలు తనకు తెలుసని రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు ఇచ్చామని, 30, 40 రోజుల్లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చిండు.. ఒక వ్యక్తి తీసుకున్న అప్పుల వర్యవసానాలను మనం ఎదుర్కొంటున్నాం. కేసీఆర్ తీసుకున్న అప్పులు.. చేసిన తప్పులకు రూ.లక్ష 53 వేల కోట్లు చెల్లించామని సీఎం రేవంత్ అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌లు 8000 కోట్లు పెండింగ్ పెట్టారు. నా దగ్గర రూ.లక్ష 53 వేల కోట్లు ఉంటే, క్షణంలో రూ.2 లక్షల రుణాలు మాఫీ చేసేవాడిని అని పేర్కొన్నారు.

రాగల ఐదురోజుల్లో తెలంగాణవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు

-పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్ జారీ

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. మార్చిలోనే ఎండలు దంచికొడుతుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ తీపికబురు చెప్పింది. రాగల ఐదురోజుల్లో తెలంగాణవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని.. రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని.. ఆ తర్వాత మళ్లీ పెరిగేందుకు అవకాశం ముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతాయంటూ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, వడగళ్లతో కూడిన వర్షాలు పడుతాయని.. ఈ సమయంలో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయగా.. నిర్మల్, నిజామాబాద్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ వడగళ్ల వానలు పడుతాయని పేర్కొంది. మరికొన్ని ఉరుములు, మెరుపులతో పాటు పెనుగాలులు వీస్తాయని హెచ్చరించింది.

మెగాస్టార్ చిరంజీవిని హౌస్ ఆఫ్ కామన్స్ యుకె పార్లమెంట్‌లో ఘన సన్మానం

లండన్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మెగాస్టార్ చిరంజీవిని హౌస్ ఆఫ్ కామన్స్ యుకె పార్లమెంట్‌లో ఘనంగా సత్కరించింది. సినీ, సేవా రంగాల్లో ఆయన చేసిన సేవలకు జీవిత సాఫల్య పురస్కారంతో గౌరవించింది. ఈ సందర్భంగా ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. చిరుకు సోదరుడిగా జన్మించినందుకు గర్వంగా ఉందని, ఈ పురస్కారం ఆయనకు మరింత కీర్తి తీసుకొచ్చిందని కొనియాడారు. పవన్ కల్యాణ్ తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'సాధారణ మధ్యతరగతి ఎక్జైజ్ కానిస్టేబుల్ కొడుకుగా జీవితం మొదలుపెట్టి, స్వశక్తితో, కళామతల్లి దీవెనలతో, చిత్ర రంగంలో మెగాస్టార్ గా ఎదిగి, నాలుగున్నర దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తూ, తన నటనతో ఉత్తమ నటుడిగా 9 ఫిలింఫేర్ అవార్డులు, 3 నంది అవార్డులు అందుకుని, నటనకు పర్యాయపదంగా నిలిచిన వ్యక్తి. ఆయన తమ్ముడిగా పుట్టినందుకు ఎప్పుడూ గర్విస్తూనే ఉంటాను. నేను చిరంజీవిని ఒక అన్నయ్య గా కంటే ఒక తండ్రి సమానుడిగా భావిస్తాను. నేను జీవితంలో ఏం చేయాలో తెలియక, అయోమయంలో ఉన్న పరిస్థితుల్లో నాకు మార్గం చూపించిన వ్యక్తి ఆయన. నా జీవితానికి హీరో అన్నయ్య చిరంజీవి. తన సేవా భావంతో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించడం ద్వారా ఆపదలో ఉన్నవారికి రక్తదానం, నేత్రదానం అందిస్తూ, నన్నే కాకుండా కోట్లాదిమంది అభిమానులను సమాజ సేవకులుగా మార్చిన స్ఫూర్తి ప్రదాత మా అన్నయ్య కొణిదల చిరంజీవి. తాను ఎదగడమే కాకుండా తన కుటుంబంతో పాటుగా, ఎంతోమంది ఎదుగుదలకు ప్రత్యక్షంగాను పరోక్షంగాను సహాయ సహకారాలు అందిస్తూ, టాలెంట్ ఉన్న ఎవరైనా సరే ఏ రంగంలో అయినా సరే రాణించవచ్చు అనేందుకు ఉదాహరణగా నిలిచారు. ఆయన సమాజానికి అందించిన సేవలకు గాను ఇటీవలే భారత ప్రభుత్వం రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ చేతుల మీదుగా అందుకున్నారు' అని పవన్ ప్రశంసించారు. పద్మవిభూషణ్ డా. మెగాస్టార్ చిరంజీవికి, ఈనెల 19న జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించిన వార్త తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని, భవిష్యత్తులో ఆయన మరిన్ని పురస్కారాలు అందుకుని మా అందరికీ మార్గదర్శిగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ పురస్కార కార్యక్రమానికి హోస్ట్ గా వ్యవహరిస్తున్న స్టాక్ పోర్ట్ ఎంపి నవేందు మిశ్రాకి ప్రత్యేక ధన్య

గాంధీ అత్యవసర విభాగంలో అదనంగా 30 పడకల ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 20:రోజురోజుకి పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా అత్యవసర సేవల విభాగంలో అదనంగా 30 పడకలను ఏర్పాటు చేస్తున్నామని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి తెలిపారు. గురువారం ఆమె తన చాంబర్‌లో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ఆర్ఎంవోలు, నర్సింగ్, సాంకేతిక, పారిశుధ్య సిబ్బందితో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

గాంధీ దవాఖానాలో రోగులందరికీ మెరుగైన సేవలు అందిస్తున్నామని, ప్రజలందరికీ ఇక్కడ లభించే వైద్యంపైన విశ్వాసం పెరిగిందని ఆమె అన్నారు. ముఖ్యంగా అత్యవసర సేవల విభాగమైన క్యాజువాలిటీ వార్డులో ప్రస్తుతం 60 పడకలు అందుబాటులో ఉన్నాయని, అదనంగా 15 శస్త్ర చికిత్స, 15 వైద్య చికిత్స కోసం కొత్తగా 30 పడకలను అందుబాటులోకి తెచ్చామని ఆమె తెలిపారు.

ఈ సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.సునీల్ కుమార్, ఆర్థోపెడిక్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ బి. వాల్యా, జనరల్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. సునీల్ కుమార్, ఆర్ఎంవోలు పాల్గొన్నారు.

గంగారం పెద్ద చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, మార్చి 20: గంగారం పెద్ద చెరువు కబ్జాలపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేసిన ఆరోపణలపై గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్.. రెవెన్యూ, జిహెచ్ఎంసి, ఇరిగేషన్ విభాగాల అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. చెరువులో మట్టిని నింపుతుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా చెరువులో మట్టినింపుతూ.. ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కబ్జాదారులు ముందుగా మట్టిని నింపి అటుపై ఆక్రమణలతో నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. చెరువుల ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చెరువు కబ్జాలపై చేసిన ఆరోపణల నేపథ్యంలో పరిశీలిస్తున్నట్లు ఆయన అన్నారు. చెరువులోని కబ్జాలపై పూర్తి వివరాలు తెలుసుకుని, తొలగించి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. హైడ్రా కమిషనర్ తోపాటు చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత సంస్కృతి కళలు చాలా గొప్పగా ఉన్నాయి

-మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: భారత సంస్కృతి కళలు చాలా గొప్పగా ఉన్నాయని మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా తెలిపారు.

హైదరాబాద్‌లో తనకు చాలా గొప్పగా స్వాగతం పలికారని, తన హృదయంలో ఈ దేశానికి చాలా ప్రాధాన్యత ఉంటుందన్నారు. నమస్తే ఇండియాతో ఆమె ప్రసంగం మొదలుపెట్టారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ ఏర్పాట్ల గురించి నిర్వహించిన సమీడియా సమావేశంలో క్రిస్టినా ప్రసంగించారు. తెలంగాణలో చాలా దేవాలయాలను సందర్శించానని పేర్కొన్నారు. భారత్‌లో భిన్నత్వంలో ఏకత్వం ఎంతో గొప్పగా ఉందని, ఎన్నో భాషలు ఉన్న అంతా కలిసి మెలిసి ఒక్కటిగా ఉండడం అనేది స్ఫూర్తినిస్తుందని మెచ్చుకున్నారు. మిస్ వరల్డ్ కూడా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని తెలిపారు.

ఇక్కడ ట్రెడిషన్ చాలా బాగా నచ్చిందన్నారు. 72వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ వేదికగా మారింది. మిస్ వరల్డ్ పోటీల్లో 140 దేశాల నుంచి అందాల బామలు పాల్గొంటారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ ఏర్పాట్లను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడారు. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల నిర్వహణను అవకాశంగా తీసుకోవాలని, మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ సిఎం రేవంత్ రెడ్డి ఆలోచన నుంచి వచ్చిందని, మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించవచ్చన్నారు. సుమారు 140 దేశాల వారు ఇక్కడికి వస్తారని ప్రపంచం దృష్టి తెలంగాణ రాష్ట్రంపై పడుతుందని వివరించారు. అందాల పోటీ లు అంటే ఇంకో కోణంలో చూడొద్దని ఇది ఎంతో మంది అమ్మాయిలకు, మహిళలకు, మనోధైర్యం, సంకల్పం ఇస్తుందని జూపల్లి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా, టిజిటిడిసి చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, టూరిజం సెక్రటరీ స్మితా సబర్వాల్, మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లీ హాజరయ్యారు.

జెఇఇ మెయిన్ సెషన్- 2 పరీక్షలకు అడ్వాన్స్ సిటీ ఇంటిమేషన్ స్లిప్పులను విడుదల

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఏప్రిల్ 2 నుంచి జరగనున్న జెఇఇ మెయిన్ సెషన్- 2 పరీక్షలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా గురువారం అడ్వాన్స్ సిటీ ఇంటిమేషన్ స్లిప్పులను విడుదల చేసింది. ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో పేపర్ -1 (బిఇ/బి.టెక్), -2 (బి.ఆర్క్/బి.ప్లానింగ్) పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా వివిధ నగరాలతో పాటు విదేశాల్లోని 15 నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేశారు. జెఇఇ మెయిన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏ ది. అందులో భాగంగా గురువారం తేదీ పరీక్ష ఉంటుంది. ఏ సిటీలో పరీక్ష కేంద్రం ఉంటుందనే వివరాలను అడ్వాన్స్ సిటీ ఇంటిమేషన్ స్లిప్పుల్లో పేర్కొంటారు. వీటిని డౌన్‌లోడ్ చేసుకొనేందుకు విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్/పుట్టిన తేదీతో పాటు క్యాప్చా కోడ్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఇది అడ్మిట్ కార్డు కాదని మాత్రం విద్యార్థులు గమనించాలని ఎన్‌టిఎ స్పష్టం చేసింది. ఎగ్జామినేషన్ సెంటర్ ఏ నగరంలో వచ్చిందో ముందుగా తెలుసుకొనేందుకు వీలుగా ఈ స్లిప్పులను విడుదల చేసినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. జెఇఇ మెయిన్ సెషన్ 2 పరీక్ష అడ్మిట్ కార్డులను త్వరలోనే విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.

నాల్గవ అంతర్జాతీయ సంభాషణ సదస్సులో కె. శ్రీనివాస్ రెడ్డి

సభలో ప్రసంగిస్తున్న కె. శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 20: క్యూబా దేశంలోని హవానా విశ్వవిద్యాలయంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న నాల్గవ అంతర్జాతీయ సంభాషణ సదస్సుకు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి గారిని భారతదేశ ప్రతినిధిగా నిర్వాహకులు ఆహ్వానించారు. ప్రపంచంలోని ఆయా దేశాల ప్రతినిధులు హాజరైన ఈ సదస్సును క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్ కానెల్ ప్రారంభించారు. "తప్పుడు సమాచారం మరియు మీడియా మార్పులను ఎదుర్కోవడం" అనే అంశంపై శ్రీనివాస్ రెడ్డి గారు పేపర్ ప్రెజెంటేషన్ చేసి సభికుల మన్ననలు పొందారు.

డిఎంకె ఎంపీల టీషర్టులతో గందరగోళం..

-పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా

న్యూఢిల్లీ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు అధికార, ప్రతిపక్షాల వాద ప్రతివాదనల మధ్య కొనసాగుతున్నాయి.

గురువారం డిఎంకె సభ్యులు కొందరు నినాదాలు రాసిన టీషర్టులు ధరించి ఉభయ సభలకు హాజరు కావడం గందరగోళానికి దారి తీసింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నినాదాలతో కూడిన టిషర్టులు ధరించి సభలకు రావడం పార్లమెంట్ నిబంధనలకు విరుద్ధమని, సభల గౌరవానికి భంగకరమని హెచ్చరించినా సభలు పలుమార్లు వాయిదా పడినా విపక్ష సభ్యులు మారలేదు. చివరికి ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. గురువారం లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కాగానే విపక్ష డిఎంకె సభ్యులు నినాదాలు రాసి ఉన్న టీ షర్టులు ధరించి లోక్‌సభకు వచ్చారు. దీనికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అసహనం వ్యక్తం చేశారు. ఇది పార్లమెంటరీ నియమాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. అనంతరం సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ' నిబంధనలు, విధానాలతో సభలు నిర్వహిస్తారు. సభ్యులు హుందాగా వ్యవహరించి సభ గౌరవాన్ని కాపాడుకోవాలి . కానీ ప్రతిపక్ష పార్టీ లోని కొంతమంది ఎంపీలు నిబంధనలు పాటించడం లేదు. ఇది సరైనది కాదు. ఎంత పెద్ద నాయకుడైనా సభ గౌరవాన్ని తగ్గించే ఇలాంటి దుస్తులు ధరించడం ఆమోద యోగ్యం కాదు" అని ఓం బిర్లా పేర్కొన్నారు.

ఆహ్వానము

భవానీ సాహిత్య వేదిక
కరీంనగర్ - తెలంగాణ

కీ.శే. గుండవరం చంద్రశేఖర్‌రావు గారి మిత్రలాభం మరియు
గుండవరం ప్రభాకర్‌రావు గారి ప్రభాత కిరణాలు
పుస్తకాల ఆవిష్కరణ సభ

వేదిక : లలిత కళా వేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాద్.
తేది : 23.03.2025 ఆదివారం ఉ॥ 9.00 గంటలకు

సభాధ్యక్షులు :
డా. వైరాగ్యం ప్రభాకర్ గారు, అధ్యక్షులు, భవానీ సాహిత్య వేదిక, కరీంనగర్.

ముఖ్య అతిథి & గ్రంథావిష్కర్త :
డా. ఏనుగు నరసింహారెడ్డి గారు
ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ కార్యదర్శి

విశిష్ట అతిథులు :
శ్రీ కాంచనపల్లి గోవర్ధన రాజు గారు
ప్రముఖ కవి, విజిటింగ్ ప్రొఫెసర్ పాల్కి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు, సినీ టీవీ సహస్రగేయ రచయిత

ఆత్మీయ అతిథులు :
శ్రీ సాదనాల వేంకటస్వామి నాయుడు గారు, కవి, నటులు, ఆంధ్రప్రదేశ్ నంది పురస్కార గ్రహీత
డా. రాయరావు సూర్యప్రకాష్ గారు, అధ్యక్షులు, దర్శనం సాహితీ వేదిక
డా. రాధా కుసుమ గారు, ప్రముఖ కవయిత్రి, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షులు

ప్రత్యేక అతిథులు :
శ్రీ దేవి ప్రసాద్ రావు గారు
టిఎన్‌జేతో ఉద్యమ నాయకులు, తెలంగాణ రాష్ట్ర టెనెరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్
శ్రీ హరికిషన్ రావు గారు, రోజలి కాన్సెంట్ స్కూల్ అధినేత, మేడ్చల్.

ప్రధాన వక్త :
శ్రీ డి.సి. నరసింహులు గారు
పద్మ కవి, విశ్రాంత ప్రధానాచార్యులు, మేడ్చల్ (మిత్రలాభం)
శ్రీ చౌడూరి నరసింహరావు గారు
ప్రముఖ కవి, చౌడూరి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు (ప్రభాత కిరణాలు)

కవి సమ్మేళనం సమన్వయకర్త :
డా. రాధా కుసుమ గారు, ప్రముఖ కవయిత్రి, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షులు

ఆహ్వానించువారు :
గుండవరం ఇందిర ప్రభాకర్‌రావు గారు
గుండవరం రమాదేవి కొండలరావు గారు
బొందుగులపాటి శారదాదేవి గారు
మేడ్చల్.

అందరూ ఆహ్వానితులే !

భూమాత ఊపిరితిత్తులు సువిశాల హరిత అడవులు

(21 మార్చి "అంతర్జాతీయ అడవుల దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.6 బిలియన్ల గిరిజనులు తమ ఆహారం, ఆవాసం, శక్తి, ఔషధాలు, ఆదాయ వనరులు, జీవన భృతులకు అడ్మిషన్లు మాత ఒడిన జీవితాలను గడుపుతున్నారు. దాదాపు 80 శాతం జీవవైవిధ్య పరిరక్షణ అడవులతోనే సుసాధ్యం అవుతున్నది. అడవులతో మానవాళికి కలప, వంట చెరుకు, పేపర్, ఫర్నీచర్, ఔషధాలు, జిగురు, ఆహారం, పూలు/పండ్లు/కాయలు/మొగ్గలు, శుద్ధ జలం, పశుగ్రాసం, పీచు పదార్థాలు, నూనెలు లాంటి అనేక ఉత్పత్తులు ఉచితంగా, సమృద్ధిగా అందుబాటులో ఉంటున్నాయి. అడవుల పరోక్ష ప్రయోజనాల్లో వానలు కురవడం, భూతాపం అదుపులో ఉండడం, కరువు నివారణ, జీవవైవిధ్యం సంరక్షించబడడం, నేల నాణ్యత పెరగడం, నేల కోత అరికట్టబడడం, వరదలను అదుపు చేయడం, గాలి శుద్ధి చేయబడడం, కార్బన్‌ను తొలగించడం, వాతావరణ సానుకూల మార్పులు జరగడం లాంటి పలు అంశాలు ఉన్నాయి. స్వార్థపూరిత, అనాలోచిత, అజ్ఞాన మానవ ప్రమేయాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తరుగుతోంది. ప్రతి ఏట దాదాపు 13 హెక్టార్ల అడవులు కోతకు గురి అవుతున్నాయి.

అంతర్జాతీయ అడవుల దినోత్సవం-2025 ఇతివృత్తం:

భూగోశడళంపై దాదాపు 30 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలి. పోడు సాగు, కలప స్మగ్లింగ్ లాంటివి కూడా అటవీ విస్తీర్ణం తగ్గడానికి కారణం అవుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నేటికి దాదాపు సగానికి పైగా అడవులను ప్రపంచం కోల్పోవడంతో నేడు విపరీతమైన ప్రతికూల వాతావరణ మార్పులను చవిచూస్తున్నాం. భూమాత ఊపిరితిత్తులు, కార్బన్ శోషణ కేంద్రాలుగా అమూల్య సేవలను అందిస్తున్న అడవుల పరిరక్షణ ఉద్యమాలకు ఊపిరి పోయడానికి ఐరాస ప్రతి ఏట 21 మార్చిన "అంతర్జాతీయ అడవుల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఫారెస్ట్రీ)"ని పాటించారని 2013లో నిర్ణయం తీసుకోవడం జరిగింది. 2025 అంతర్జాతీయ అడవుల దినోత్సవ ఇతివృత్తంగా "అడవులు – ఆహారం (ఫారెస్ట్స్ అండ్ ఫుడ్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

అడవుల పరిరక్షణ – జీవకోటి రక్షణ:

అడవుల నరికివేత ఫలితంగా క్రూర జంతువులు, కోతులు, పులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు లాంటివని మానవ ఆవాసాల్లో సంచరించడం అపారమైన పంట ప్రాణ నష్టాలు చేయడం చూస్తున్నాం. అడవుల సంరక్షణకు ప్రతి ఏట మొక్కలు నాటడం, నరికి అడవులకు అనేక రెట్లు వనాలు పెంచడం, కార్చిచ్చులను అదుపు చేయడం, అటవీ సంరక్షణ చట్టాలకు పదును పెట్టడం, మానవ ఆవాసాల్లో హరిత వనాలు పెంచడం, పోడు వ్యవసాయాన్ని తగ్గించడం, వన్య ప్రాణులను కాపాడడం, అడవులను పర్యాటక స్థలాలుగా మార్చడం, అటవీ ఉత్పత్తులను పెంచుకోవడం, పేపర్/కలప వినియోగాలను తగ్గించడం లాంటి చర్యలు దోహదపడతాయి.

మనిషి లేకుండా అడవులు ఉండగలవని, అడవులు లేకుండా మానవ (సకల జీలవకోటి) జీవితాలు అసాధ్యమని తెలుసుకోవాలి. అడవులు మనం పీల్చే గాలి ప్రసాదమని, హరిత క్షేత్రాలు మన జీవితాలతో విడదీయరాని బంధాన్ని వెనవేసుకున్నాయని తెలుసుకొని అడవులను రక్షించుకుందాం, మొక్కలను నాటి పోషించుకుందాం, పచ్చని కాపురాల తోరణాలతో సంతోషంగా జీవితాలను గడుపుదాం.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

నేత్రపర్వంగా ఖాద్రీశుడి బ్రహ్మరథోత్సవం

–హాజరైన లక్షలాదిమంది భక్తులు
–శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధానమైనది బ్రహ్మ రథోత్సవం
–భక్తుల కోసం భారీగా అన్నదానాలు
-ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు

అమరావతి, మార్చి 20: శ్రీ సత్యసాయి జిల్లా కదిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి బ్రహ్మరథోత్సవం (తేరు) కన్నుల పండువగా జరిగింది. 15రోజులు పాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం ఉభయ దేవర్లతో కూడి బ్రహ్మ రథోత్సవంపై విహరించారు. ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, అనంతరం శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడిని బ్రహ్మరథంపై అధిష్టింపజేశారు.

బ్రహ్మరథం తేరు వద్ద అర్చకులు ఆగమన శాస్త్ర ప్రకారం విశిష్ట పూజలు చేశారు. పూజలకు స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జిల్లా ఎస్పీ వి.రత్న, ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కదిరి ఆర్డీవో ఎన్ ఎస్ శర్మ, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, బీజేపీ నాయకులు వంశీ, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు హాజరయ్యారు. ఉదయం 9.15 నిమిషాలకు తిరువీధుల ఉత్సవానికి రథం కదిలింది. రథోత్సవానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. జయ జయ నినాదాల మధ్య దేవదేవుడు బ్రహ్మరథంపై విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వడం బ్రహ్మరథోత్సవం ప్రత్యేకత.

నేడు కుటుంబసమేతంగా తిరుమలకు చంద్రబాబు

తిరుపతి, మార్చి 20:సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ, రేపు తిరుమలలో పర్యటించనున్నారు. పర్యటనకు ఇందులో భాగంగానే నేడు రాత్రి తిరుమల చేరుకోనున్నారు సీఎం చంద్రబాబు నాయుడు. రేపు సీఎం చంద్రబాబు మనవడు దేవాన్ష్ పుట్టినరోజు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి చంద్రబాబు శ్రీవారిని దర్శించుకోనున్నారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం ఒక్కరోజు విరాళం అందించనున్నారు చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి.

దీనికి అవసరమైన ఒకరోజు మొత్తం ఖర్చు 44 లక్షల రూపాయలను టీటీడీ శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరాళంగా అందించనున్నారు. ఈసందర్భంగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించనున్నారు. ఇక, ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం ప్రతి ఏటా నారా దేవాన్ష్ పుట్టిన రోజు నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆరోజు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు అన్నప్రసాదాన్ని స్వయంగా వడ్డిస్తారు. ఆ రోజు మొత్తం అయ్యే ఖర్చును చంద్రబాబు కుటుంబం టీటీడీకి అందజేస్తోంది.

చంద్రబాబు, మంద కృష్ణల కృషి ఫలితమే ఎస్సీ వర్గీకరణ- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 20: ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయి వరకు వచ్చిందంటే మంద కృష్ణ మాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ,. మాదిగ అని చెప్పగలిగే గుండె ధైర్యం కలిగిన వ్యక్తి మంద కృష్ణ అని, ఆ కులానికి వన్నె తెచ్చిన ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయికి వచ్చిందంటే మంద కృష్ణ, సీఎం చంద్రబాబు కారణమని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబుకు పవన్ ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు జరుగుతుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు లేని కులాలపైనే విస్తృతంగా చర్చలు జరిగాయని గుర్తు చేశారు.

సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారన్నారు.. కమిషన్ ఇచ్చిన నివేదిక చాలా అద్భుతంగా ఉందని , దాని ఆధారంగా ఎస్సీలకు మరింత మేలు జరుగుతుందనే ఆశాభావాన్ని డిప్యూటీ సిఎం వ్యక్తం చేశారు.

ఈ వ్యవస్థతో బహుళ భాషలలో ఎంపీలు, పరిశోధకులు, విద్యారంగంలోని వారికి విస్తృత పార్లమెంటరీ చర్చలు

న్యూఢిల్లీ, మార్చి 20: పార్లమెంటు కార్యకలాపాల సందర్భంగా బహుభాషా సౌలభ్యం దిశగా కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థ (సంసద్ ఏఐ సొల్యూషన్) రూపకల్పన కోసం లోక్‌సభ సచివాలయం-కేంద్ర ఎలక్ట్రానిక్స్-సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా-కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్‌ల సమక్షంలో సంతకాలు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమం కింద 'సంసద్ భాషిణి' పేరిట సభా వ్యవహారాలకు సంబంధించి బహుళ భాషలలో క్రమబద్ధీకరించే ప్రక్రియలతో కూడిన సమగ్ర సభాంతర కృత్రిమ మేధ వ్యవస్థను అందుబాటులోకి తేవడం ఈ ఒప్పందం ధ్యేయం.

పార్లమెంటరీ సమాచార నిధి ఆధారంగా ఉత్పత్తులు/ఉపకరణాల సంయుక్త రూపకల్పన-వినియోగంపై లోక్‌సభ సచివాలయం, మంత్రిత్వశాఖ అంగీకారానికి వచ్చాయి. 'ఏఐ' ఉపకరణాలు/ఉత్పత్తులపై అవగాహన, మెరుగుదల కోసం పార్లమెంటు నుంచి లభించే పార్లమెంటరీ సమాచారం-వనరులను ఉపయోగించుకుంటారు. ఈ సందర్భం గా అనువాద సామర్థ్యం, ఇతర సాంకేతిక నైపుణ్యాన్ని భాషిణి సమకూరుస్తుంది.

ఈ కార్యక్రమం సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ- దీనికి నాయకత్వం వహించడంతోపాటు మార్గనిర్దేశం చేసినందుకుగాను లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం కార్యరూపంలోకి వస్తే అత్యాధునిక కృత్రిమ మేధ పరిష్కారాలతో పార్లమెంటరీ ప్రక్రియలు రూపాంతరం చెందగలవని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 'సంసద్ భాషిణి'తో బహుళ భాషలలో సమాచార సౌలభ్యం ఇనుమడిస్తుందని చట్టసభ కార్యకలాపాల పత్ర ప్రామాణీకరణ క్రమబద్ధం కాగలదని పేర్కొన్నారు. అంతేకాకుండా సాంకేతికత ఆధారిత పాలనలో భారత్ స్థానం అంతర్జాతీయంగా మరింత బలోపేతం కాగలదని ప్రగాఢ విశ్వాసం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సెక్రటరీ జనరల్ శ్రీ ఉత్పల్ కుమార్ సింగ్ కూడా పాల్గొన్నారు. కాగా, లోక్‌సభ సచివాలయం తరఫున సంయుక్త కార్యదర్శి శ్రీ గౌరవ్ గోయల్ అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు.

ఈ-నామ్ ప్లాట్‌ఫాంలో పాలుపంచుకోవాల్సిందిగా రైతులకు ప్రోత్సాహం

న్యూఢిల్లీ, మార్చి 20:మంచి ధరలను రాబట్టుకోవడానికి జాతీయ వ్యవసాయ మార్కెట్లు (ఈ-నామ్..వ-ఔంఓ)లో పాలుపంచుకోవాలంటూ చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించే దిశగా అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోంది. ఈ-నామ్ పోర్టల్, మొబైల్ యాప్ (ఇది యాండ్రాయిడ్‌తోపాటు ఐఓఎస్ ప్లాట్‌ఫాంలో అందుబాటులో ఉంది) .. ఈ వేదిక (ప్లాట్‌ఫాం)లను ఉపయోగించుకొంటూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొనే సదుపాయాన్ని ప్రవేశపెట్టారు. నమోదు, ట్రేడింగు ప్రక్రియల్లో రైతులకు సాయపడడానికి వ్యవసాయ ఉత్పాదన మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ)లలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు టోల్-ఫ్రీ నంబర్ (18002700224) ను కూడా సమకూర్చారు.

చిన్న, సన్నకారు రైతులు పండించిన పంట వ్యక్తిగత ప్రాతిపదికన చూస్తే చిన్నదిగా ఉండవచ్చు, ఆయా పంటలను ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) మాధ్యమం ద్వారా ఒక చోటుకు తీసుకువచ్చినప్పుడు భారీ పరిమాణం వల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి వీలు ఉంటుంది. ఎఫ్‌పీఓలు సభ్య రైతులు సాధించిన దిగుబడులను ఒక చోటుకు చేర్చగలుగుతాయి. ఎఫ్‌పీఓ ట్రేడింగ్ మాడ్యూల్ ద్వారా ఈ-నామ్ సౌలభ్యాన్ని వినియోగించుకోవచ్చు.

ఫిబ్రవరి 28 నాటికి 4392 ఎఫ్‌పీఓలు ఈ-నామ్ వేదికపైకి వచ్చి నిలిచాయి.

దీనికి తోడు, ఒక రైతు తాను పండించిన పంటను.. ఏపీఎంసీ వద్దకు వెళ్లనక్కర లేకుండానే ఫాం గేట్ మాడ్యూలును ఉపయోగించుకోవడం ద్వారా అమ్మకానికి పెట్టుకోవచ్చు.

ఏపీఎంసీలు ఆయా రాష్ట్రాల ఏపీఎంసీ చట్టం నియంత్రణ పరిధిలో పనిచేస్తుంటాయి. ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా అంతర్ రాష్ట్ర వ్యాపారం చేయాలంటే గనక ఇతర రాష్ట్రాల వ్యాపార లైసెన్సులకు గుర్తింపునివ్వడానికి తదనుగుణమైన నిబంధనలు అవసరమవుతాయి.

రాష్ట్రాల మధ్య వ్యాపారంతోపాటు మార్కెట్ల మధ్య వ్యాపారాన్ని ప్రోత్సహించడంలో ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్)కు సంబంధించిన సవాళ్లు ఎదురవుతాయన్న సంగతిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని ఈ-నామ్ ప్లాట్‌ఫాంను 'ఈ-నామ్ 2.0' అనే రూపంలో ఉన్నతీకరించాలని (అప్‌గ్రేడేషన్) నిర్ణయించింది. ఇది లాజిస్టిక్ సేవలను అందించే వివిధ సంస్థలను కలుపుకొని ముందుకుపోవడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. లాజిస్టిక్ సంబంధిత అంతరాన్ని తొలగించడంతోపాటు వ్యాపారాన్ని వేగవంతం చేయాలని, వ్యర్థాలను తగ్గించాలని, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచాలన్నవి కూడా ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశాలే.

రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్రాల వ్యవసాయ మార్కెటింగ్ బోర్డుల నుంచి అందిన అభ్యర్థనల ఆధారంగా ఆయా సరకులకు వ్యాపార యోగ్య కొలమానాలను ఖరారు చేస్తారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 28 నాటికి ఈ-నామ్ వేదిక ద్వారా ఆన్‌లైన్ వేలంపాట కోసం 231 సరకులకు వ్యాపార యోగ్య కొలమానాలను ఖరారు చేశారు.

ప్రస్తుత ఈ-నామ్ వేదికను మరింత సమర్థమైందిగా, యూజర్లకు అనుకూలమైందిగా, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకుపోయేదిగా, బాహాటమైన నెట్‌వర్కుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో ఉన్నతీకరించాలని నిర్ణయించారు. బ్యాంకు ఖాతా నిజమైందేనని తెలియజేయడం, ఆధార్‌ను ఉపయోగించి ఈకేవైసీ సౌకర్యం-నిర్ధారణ, లాజిస్టిక్స్, ఇంకా ఇతర విలువ జోడించిన సేవలను అందించే సంస్థలను చేర్చుకోవడం.. ఇవి ఈ-నామ్ 2.0 విశేషాంశాలలో చెప్పుకోదగ్గవి.

ఈ సమాచారాన్ని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రాంనాథ్ ఠాకూర్ ఈ రోజు లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

ఏపీకి తరలి రండి.. స్టూడియోలు నిర్మించండి-టాలీవుడ్ కు మంత్రి పిలుపు

–అందమైన లోకేషన్లు ఉన్నాయి
–భారీ స్థాయిలో రాయితీలు ఇస్తాం
–సింగిల్ విండో ద్వారా వెంటనే అనుమతిస్తాం
–అసెంబ్లీలో సినీ పరిశ్రమపై ప్రశ్నోత్తరాలు
–చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
–వివరాలు వెల్లడించిన మంత్రి దుర్గేష్

అమరావతి, మార్చి 20:ఏపీలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కేవలం షూటింగ్ చేసి వెళ్లిపోవడం, ఆదాయం తీసుకోవటం కాకుండా.. స్టూడియోల నిర్మాణంపై దృష్టి సారించాలని సినీ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. విశాఖలో సినీ పరిశ్రమపై విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అసెంబ్లీలో మట్లాడుతూ.. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం స్టూడియోల నిర్మాణానికి గతంలో ప్రభుత్వం భూములు కేటాయించిందన్నారు. ఆ క్రమంలో ప్రముఖ నిర్మాత రామానాయుడు స్టూడియో నిర్మాణానికి 35 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని వెల్లడించారు. అయితే.. ఆ భూమిని స్టూడియో కోసం వినియోగించకుండా కొంత భూమిని లే అవుట్లు వేసి విక్రయించే ప్రయత్నాలు జరిగాయని, తాను న్యాయపోరాటంతో లేఅవుట్ విక్రయాలను నిలుపుదల చేయించానని తెలిపారు.. తాజాగా ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. రామానాయుడు స్టూడియోకు గతంలో ఇచ్చిన భూములను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇచ్చిన ప్రభుత్వం వేరు.. అమ్మింది వేరు..

ప్రభుత్వం నుంచి తీసుకున్న భూమిని స్టూడియో కోసం వినియోగించలేనందున ఆ భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్యే రామకృష్ణబాబు కోరారు. దీనికి మంత్రి దుర్గేష్ సమాధానం చెబుతూ.. గతంలో రామానాయుడు స్టూడియో కోసం 34.44 ఎకరాలు భూమి కేటాయించామని, దానిలో కొంతభాగం 15ఎకరాల్లో లేఅవుట్ వేసి వేరే అవసరాల కోసం వాడాలని చూశాం న్నారు. ఇచ్చిన ప్రభుత్వం వేరు.. వేరే అవసరాల కోసం వాడాలని చూసిన ప్రభుత్వం వేరు అని మంత్రి చెప్పారు. తమ ప్రభుత్వంలో గతంలో ఏం జరిగిందనే దాని కంటే సీని పరిశ్రమను ఏపీలో అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని చెప్పారు. విశాఖలో ఇప్పటికిప్పుడు సినీ ఇండస్ట్రీ తీసుకువచ్చే ప్రతిపాదన లేదన్నారు. సినీ నిర్మాతలు, ప్రముఖులతో మాట్లాడి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఏపీలో సినిమాలు తీసేందుకు చాలా లొకేషన్లు ఉన్నాయని మంత్రి చెప్పారు. ఏపీలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఇదే సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ బొత్స మండలిలో మాట్లాడుతూ.. విశాఖలో గత ప్రభుత్వాల సమయాల్లో భూకేటాయింపులు జరిగాయి. అవి ఇప్పుడు చర్చించదలుచుకోలేదు కానీ.. అక్కడ భూములు తీసుకున్న వారు స్టూడియోలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలి. భవిష్యత్తులో కాకుండా.. వెంటనే కొనసాగించే ప్రయత్నం చేయాలని కోరారు.

ప్రధానమంత్రితో రాజ్యసభ ఎంపీ శ్రీ ఇళయరాజా భేటీ

న్యూఢిల్లీ, మార్చి 20:ఇళయరాజా మొట్టమొదటిసారి పాశ్చాత్య సంప్రదాయ స్వరసమ్మేళనం వాలియంట్‌ను లండన్‌లో ఇటీవలే ప్రతిష్ఠాత్మక రాయల్ ఫిల్‌హార్మనిక్ ఆర్కెస్ట్రాతో కలిసి వినిపించారంటూ శ్రీ మోదీ ప్రశంసించారు. '

మేస్ట్రో' భారతీయ సంగీత జగతితోపాటు ప్రపంచ సంగీతంపైన కూడా పెను ప్రభావాన్ని ప్రసరించిన సంగతిని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గుర్తుచేస్తూ, ఇళయ రాజాను "సంగీత దిగ్గజం, మార్గదర్శి" అని, ఆయన స్వర రచనలు ప్రపంచ స్థాయిలో శ్రేష్ఠత్వాన్ని మళ్లీ మళ్లీ నిర్వచిస్తూనే ఉంటాయంటూ ప్రశంసలు కురిపించారు.శ్రీ మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఒక సందేశాన్ని పొందుపరుస్తూ ఇలా పేర్కొన్నారు:

"మన సంగీత రంగంలో, మన సంస్కృతిపై మహత్తర ప్రభావాన్ని ప్రసరించిన మేధావి, సంగీత రంగ దిగ్గజం, రాజ్య సభ ఎంపీ తిరు ఇళయరాజా జీతో భేటీ కావడం సంతోషం కలిగించింది.

ఆయన అచ్చమైన మార్గదర్శి. కొన్ని రోజుల కిందటే లండన్‌లో మొట్టమొదటి పాశ్చాత్య సంప్రదాయ స్వరసమ్మేళనం 'వాలియంట్'ను ఆయన సమర్పించి, మరో సారి చరిత్ర సృష్టించారు. ఈ ప్రదర్శనలో ప్రపంచ ప్రఖ్యాత రాయల్ ఫిల్‌హార్మనిక్ ఆర్కెస్ట్రా కూడా జత కలిసింది. ఈ మహత్వపూర్ణ, అద్భుతకృత్యం ఆయన అసమాన సంగీత యాత్రలో మరో గొప్ప మజిలీ. ఆయన నిరుపమ సంగీత ప్రస్థానం ప్రపంచ స్థాయిలో శ్రేష్ఠత్వాన్ని పునర్‌నిర్వచిస్తూ మునుముందుకు సాగిపోతూనే ఉంటుంది.

రసిక స్వామీజీ అరెస్ట్.. మహిళలను లోబర్చుకొని బ్లాక్ మెయిల్

మెదక్, మార్చి 20: భక్తి ముసుగులో మహిళలకు మత్తు మందు ఇచ్చి శారీరకంగా లోబర్చుకుని నగ్నంగా ఉన్న వీడియోలతో బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడి అందినకాడికి దోచుకున్న ఓ దొంగ స్వామీజీ పోలీసులు పట్టుకొని అరెస్టు చేసిన సంఘటన మెదక్ జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. వేములవాడ జిల్లా అనుపురం గ్రామానికి చెందిన బుడగ జంగం బొమ్మెర బాపు స్వామి అలియాస్ శివ స్వామి మెదక్ జిల్లాతో పాటు పలు ప్రాంతాల్లో తిరుగుతూ జ్యోతిష్యం చెప్తూ పూజలు చేస్తుండేవాడు. వేములవాడకు చెందిన జ్యోతిష్యం శివ స్వామి పేరిట విజిటింగ్ కార్డు పంచుతూ సంచరిస్తున్నాడు.

అందమైన మహిళలు తమ సమస్య పరిష్కరించాలని అతడి వద్దకు వస్తే వారికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకొని పూజలు చేయాలని నమ్మబలికే వాడు. పూజ సమయంలో నిమ్మకాయ, పసుపు, కుంకుమ వాసనలు చూపిస్తూ నీటిలో నిద్ర మాత్రలు కలిపి తాగించి, మహిళలు సృహ కోల్పోయాక శారీరకంగా అనుభవించి సెల్ ఫోన్ లో నగ్న వీడియోలు చిత్రీకరించే వాడు. ఆ తర్వాత కొంత కాలానికి సదరు మహిళలకు ఫోన్ చేసి నగ్నంగా ఉన్న వీడియోల విషయం చెప్పి బ్లాక్ మెయిల్ పాల్పడి మహిళల ఆర్థిక స్తోమతను బట్టి డబ్బులు డిమాండ్ చేసి వసూల్ చేసి జల్సాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు.

ఇదే క్రమంలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్ తదితర ప్రాంతాల్లో ఇదే తరహాలో దొంగ స్వామీజీ వసూళ్లకు పాల్పడినట్లు గుర్తించారు. బ్లాక్ మెయిల్ తో ఐ ఫోన్, కార్లు వినియోగం లాంటి లగ్జరీ లైఫ్ అనుభవిస్తున్న స్వామీజీ లీలల పై బాధితుల నుంచి పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. దీంతో నిఘా పెట్టిన పోలీసులు నర్సాపూర్ లో స్వామిని అదుపులోకి తీసుకొని విచారణ జరిపి సెల్ ఫోన్ లోని మహిళల నగ్న వీడియోలు, బ్లాక్ మెయిల్ చేసి వసూల్ చేసి ఆన్ లైన్ వివరాలను పోలీసులు గుర్తించారు.

భర్తను..ప్రియుడితో కలిసి హత్య చేసిన భార్య

– ముక్కలుగా చేసి సిమెంట్ వేసి ప్యాక్ చేసిన వైనం

మిరట్ ,మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తన కూతురు పుట్టిన రోజు వేడుకల కోసం విదేశాల నుంచి ఇంటికి వచ్చిన భర్తను.. తన ప్రియుడితో కలిసి భార్య హత్య చేసి.. ముక్కలుగా చేసి సిమెంట్ వేసి ప్యాక్ చేసిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని మిరట్‌లో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. మిరట్‌లోని బ్రహ్మపురి ఇంద్రానగర్ ఫేజ్ 2కి చెందిన సౌరభ్ కుమార్ 2016లో గౌరీపురానికి చెందిన ముస్కాన్ రస్తోగిని ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే తాను భార్యతో కలిసి ఉండటం కోసం తన మర్చెంట్ నేవీ ఉద్యోగాన్ని వదిలేశాడు సౌరభ్. ఈ విషయం అతని కుటుంబసభ్యులకు నచ్చకపోవడంతో సౌరభ్ తన భార్యతో కలిసి వేరే కాపురం పెట్టాడు.

2019లో వీరికి కూతురు పుట్టింది. అయితే అంతకు ముందే ముస్కాన్‌కి సాహిల్ శుక్లా అనే వ్యక్తితో అక్రమ సంబంధం ఉందని సౌరభ్‌కు తెలిసింది. దీంతో వీరిద్దరు విడాకుల వరకూ వెళ్లారు. కానీ, కూతురి భవిష్యత్తు గురించి ఆలోచించి సౌరభ్ మళ్లీ 2023లో మర్చెంట్ నేవీ ఉద్యోగంలో చేరాడు. ఈ క్రమంలో అతను దేశం వదలి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.కూతురి పుట్టిన రోజు కోసం ఫిబ్రవరి 24వ తేదీన సౌరభ్ భారత్‌కు వచ్చాడు. కానీ, అప్పటికే ప్రేమలో చాలా దూరం వెళ్లిన ముస్కాన్, సాహిల్.. సౌరభ్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. మార్చి 4వ తేదీన ముస్కాన్ సౌరభ్ తినే ఆహారంలో మత్తుమందు కలిపింది. దీంతో అతను గాఢనిద్రలోకి జారుకోగానే సాహిల్ కత్తితో హత్య చేశాడు. ఆ తర్వాత శరీరాన్ని 15 భాగాలుగా నరికి ఓ డ్రమ్ములో వేసి.. సిమెంట్‌తో దాన్ని సీల్ చేశారు.సౌరభ్ గురించి చుట్టుపక్కల వాళు ప్రశ్నిస్తారని.. తన భర్తతో కలిసి టూర్‌కి వెళ్తున్నట్లు చెప్పి.. ప్రియుడితో కలిసి వెళ్లింది. అయితే ఎన్నిరోజులైన సౌరభ్ ఫోన్ ఎత్తకపోవడంతో కుటుంబసభ్యులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ముస్కాన్, సాహిల్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా.. వాళ్లు చేసిన దారుణాన్ని బయటపెట్టారు. పోలీసులు ఆ డ్రమ్‌లోని సిమెంట్‌ను బద్దలుగొట్టి సౌరభ్ శరీర భాగాలను బయటకు తీసి పోస్ట్ మార్టంకు తరలించారు. ముస్కాన్, సాహిల్‌లను కోర్టులో ప్రవేశపెట్టనున్నారు పోలీసు

వచ్చే ఏడాది మార్చి నాటికి నక్సలిజం కనుమరుగు

-అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 20:వరకు నక్సలిజం లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. మన సైనికులు 'నక్సల్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్' దిశలో మరో పెద్ద విజయాన్ని సాధించారని కొనియాడారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్‌లలో మన భద్రతా దళాలు నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 30 మంది నక్సలైట్లు చనిపోయారని తెలిపారు. మోడీ ప్రభుత్వం నక్సలైట్లపై కఠినమైన వైఖరితో ముందుకు సాగుతోందని.. లొంగిపోవడం కోసం అవకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోలేని మావోయిస్టులు పట్ల జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంబిస్తోందని వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశం నక్సల్స్ రహితంగా మారబోతోందని స్పష్టం చేశారు.

సామాజిక న్యాయం కోసమే ఎస్సీ వర్గీకరణ - చంద్రబాబు



అమరావతి, మార్చి 20:ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేసే దిశగా సామాజిక న్యాయం కోసం తమ నిబద్ధతను నిరూపించుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో పేర్కొన్నారు. అంబేద్కర్, జగజ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిబా పూలే, ఎన్టీ రామారావు వంటి మహనీయులను స్మరించుకుంటూ ఎస్సీ వర్గీకరణను ముందుకు తీసుకువెళుతున్నామని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ ప్రతిపాదనపై ఏపీ అసెంబ్లీలో చర్చ సందర్భంగా మాట్లాడుతూ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సైతం ఎస్సీ వర్గీకరణ ఆవశ్యకతను స్పష్టం చేశారని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక న్యాయంలో భాగంగా ఎస్సీలకు వర్గీకరణ చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారని వెల్లడించారు

చరిత్రలో కొన్ని కులాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉండటానికి గల కారణాలను విశ్లేషించిన అనంతరం, స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయన్న విషయం స్పష్టమవుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఏవైనా కులాలు వెనుకబడిన వర్గాలుగా అనిపిస్తే వర్గీకరణ చేయొచ్చని సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చిందని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి వర్గీకరణకు కట్టుబడి ఉంటుందని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ఆయన స్పష్టం చేశారు. బుడగ జంగాల సమస్యను పరిష్కరించడానికి ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపి, కేంద్రం ఆమోదం తెలిపిన తర్వాత వారిని ఎస్సీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

జిల్లా వారీగా కేటగరైజేషన్ తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, 2026లో జరగబోయే జనాభా లెక్కల సేకరణ తర్వాత ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అన్ని పార్టీలు సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు.

మంద కృష్ణ మాదిగ ఉద్యమం సమయంలో మాదిగల సమస్యలను గుర్తించి, జస్టిస్ రామచంద్ర రావు కమిషన్ వేసి, వారి సిఫార్సుల మేరకు నాలుగు కేటగిరీలుగా వర్గీకరించామని తెలిపారు. దీనికి సంబంధించిన ఆర్డినెన్స్ జారీ చేసి, చట్టం కూడా తీసుకువచ్చామని గుర్తు చేశారు.

జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ కూడా వర్గీకరణ అవసరమని సమర్థించిందని, ఇటీవల జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. ఆర్.ఆర్. మిశ్రా కమిషన్ సిఫార్సుల మేరకు ఎస్సీలను గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3గా వర్గీకరించామని, జనాభా, వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామని చంద్రబాబు వెల్లడించారు.

ఈ సందర్భంగా కుల వివక్షత నిర్మూలనకు తెలుగుదేశం ప్రభుత్వం చేసిన కృషిని ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీలు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపడానికి అనేక జీవోలు జారీ చేశామని, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూశామని తెలిపారు.

ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, సామాజిక న్యాయం కోసం ఎన్టీ రామారావు చేసిన కృషిని స్మరించుకున్నారు. బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభా భారతిని అసెంబ్లీ స్పీకర్‌గా చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదని ఆయన అన్నారు. కాకి మాధవరావును చీఫ్ సెక్రటరీగా నియమించామని గుర్తు చేశారు.

రాష్ట్రపతిగా కె.ఆర్. నారాయణన్, అబ్దుల్ కలాంలను ఎన్నుకోవడంలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించిందని చంద్రబాబు అన్నారు. ఎన్డీఏ కూటమి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, భవిష్యత్తులోనూ ఈ దిశగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

తూర్పు కాపులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్న సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జనసేన, బీజేపీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నూతన సంవత్సరంలో పి-ఫోర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, దీని ద్వారా సమాజంలో పేదరికాన్ని నిర్మూలించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. చివరగా, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల జాబితాలో బుడగ జంగం కమ్యూనిటీని చేర్చాలని కోరుతూ ప్రభుత్వం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది, దీనిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

తల్లిను తలుచుకుని...

ఏపీ అసెంబ్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన తల్లిని గుర్తు చేసుకొని ఎమోషనల్ అయ్యారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నారావారిపల్లె వచ్చి.. తన తల్లి దగ్గర ఎస్సీ వర్గీకరణ కోసం మెమోరాండం ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారని తెలిపారు. అక్కడి నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం ప్రారంభించారని గుర్తుచేసుకున్నారు. తనది రాజకీయాల్లో సుదీర్ఘమైన చరిత్ర అని తెలిపారు. నారావారి పల్లెల్లో పుట్టి అంచెలంచెలుగా ఎదిగానని చెప్పారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లోకి వచ్చానని గుర్తుచేశారు. మా ఊరుకు సరైన రోడ్డు లేదన్నారు. ఇందుకోసం పోరాటం చేశానని తెలిపారు.

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. కమిషన్ నివేదిక ప్రకారం జిల్లాల వారీగా దామాషా ప్రకారం రిజర్వేషన్ విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో దళితులు అగ్రపథాన నిలిచారని గుర్తు చేశారు. దళిత వాడల్లో సంపద సృష్టి జరిగిందని వివరించారు. 800 ఎకరాలు దళితుల భూములు ఇడుపులపాయ ఎస్టేట్‌లో జగన్‌రెడ్డి కుంటుంబం ఆక్రమించుకుందని ఆయన ఆరోపించారు.

ఇక టీడీపీ మరో ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎస్సీలకు సంబంధించిన అనేక పథకాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ కోసం టీడీపీ మొదటి నుంచీ కట్టుబడి ఉందని ఆయన గుర్తు చేశారు.

అంతకుముందు ఎస్సీ వర్గీకరణపై ఏక సభ్య కమిషన్ నివేదికను మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఉభయ సభల ముందు ప్రవేశపెట్టారు. దీనిపై స్వల్పకాలిక చర్చ జరిగింది. అందులోభాగంగా ఈ అంశంపై సీఎం చంద్రబాబు నాయుడితోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు సభలో మాట్లాడారు. ఈ బిల్లును ఆమోదించిన తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేశారు.

బడ్జెట్ లో క్రీడల శాఖకు 465 కోట్లు కేటాయించడం హర్షణీయం

-తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

హదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ రాష్ట్ర బడ్జెట్

లో క్రీడల శాఖకు 465 కోట్లు కేటాయించడము గత బడ్జెట్ కన్నా 100 కోట్లు అధికం చేయడం పట్ల తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. క్రీడలకు 456 కోట్ల బడ్జెట్ కేటాయించడం పట్ల క్రీడాకారులు క్రీడా శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ,కెసిఆర్ పాలనలో పది సంవత్సరాలు నిర్లక్ష్యానికి గురైన క్రీడలకు రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ,గత బడ్జెట్లో 365 కోట్లు కేటాయించి, ఈ బడ్జెట్ లో ఇంకో 100 కోట్లు పెంచడం చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అన్నారు. యావత్ తెలంగాణ రాష్ట్ర క్రీడా కుటుంబ సభ్యులంతా ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేస్తున్నారని అయనఅన్నారు.

పెంచిన బడ్జెట్ తో గ్రామీణ క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, క్రీడా సదుపాయాలు, క్రీడాకారులకు ప్రోత్సాహం, క్రీడా కార్యక్రమాల రూపకల్పన క్రీడ మైదానాల నిర్వహణ, క్రీడ సామాగ్రి పంపిణీ, లాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ వినూత్న కార్యక్రమాలు రూపొందిస్తామని ఆయన అన్నారు.

ఎల్బీ స్టేడియంలో సంబురాలు

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ కోచులు ఉద్యోగులు సిబ్బంది మరియు క్రీడాకారులచే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేసి పెద్ద ఎత్తున టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అసిస్టెంట్ డైరెక్టర్లు కె ఆర్ బి బట్టర్,అశోక్ కుమార్,కళ్యాణి, పి ఆర్ ఓ సురేష్ కాలేరు, ఎల్బీ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు మొదటి ఘట్టం చారిత్రాత్మకం

-జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి పగిడాల సుధాకర్ ముదిరాజ్

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్); విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లో బిల్లు పెట్టి ఆమోదించడం బిసిల పోరాట విజయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి పగిడాల సుధాకర్ ముదిరాజ్ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టం చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి,,పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ , కలిసి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ విజయం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పోరాట ఫలితమని నిరంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ద్వారా ధర్నాలు నిరసనలు చేస్తూ పోరాడిన నాయకుని పోరాట ప్రతిఫలము అని అన్నారు..

బడ్జెట్ ప్రసంగం రాజకీయ ప్రసంగం లాగా ఉంది

-బడ్జెట్‌లో పచ్చి అబద్దాలు, అసత్యాలు
-మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీశ్‌రావు

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం రాజకీయ ప్రసంగం లాగా ఉందని, బడ్జెట్‌లో పచ్చి అబద్దాలు, అసత్యాలు ఉన్నాయని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్‌రావు విమర్శించారు.

భట్టి బడ్జెట్ బడా జూట్ బడ్జెట్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ బడ్జెట్ ద్వారా కాంగ్రెస్ పార్టీ తన విశ్వసనీయతను కోల్పోయిందని అన్నారు. ఈ బడ్జెట్‌లో అబద్దాలు, అతిశయోక్తులు తప్ప ఏమి లేవని పేర్కొన్నారు. ఎన్నికల ముందు అన్ని చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఏమి చెయ్యమనే మాదిరి ఈ బడ్జెట్ ప్రసంగం ఉన్నదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఏం అడిగితే అది ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. శాసనసభలో బుధవారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం అసెంబ్లీ మీడియా హాలులో బిఆర్ఎస్ ఎంఎల్ఎలతో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో, అసెంబ్లీ బయట అబద్ధాలే మాట్లాడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలందర్నీ ప్రభుత్వం మోసం చేసిందని మండపడ్డారు. స్కూల్ విద్యార్థుల డ్రెస్ కుట్టు చార్జీలు 75 ఇస్తున్నాం అంటున్నారని, గత బడ్జెట్‌లోనూ ఇదే చెప్పారని చెప్పారు. మక్కికి మక్కీ కాపీ కొట్టారని విమర్శించారు. ఈ ప్రభుత్వం నిజంగా ఇస్తున్నది 50 రూపాయలు మాత్రమే అని పేర్కొన్నారు. ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని బడ్జెట్‌లో చెప్పారని, కానీ బిఆర్ఎస్ 6లక్షల 47వేల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. బడ్జెట్ ప్రసంగం అంతా అరచేతిలో వైకుంఠం, ఆద్యాంతం అబద్దాలు అని విమర్శించారు. 72 పేజీల భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో రెండు పేజీలు పెరిగింది తప్ప, పేదల సంక్షేమం పెరగలేదని విమర్శించారు. ఇది అన్ రియలిస్టిక్ బడ్జెట్ అని, ఈ బడ్జెట్ ద్వారా కాంగ్రెస్ తన విశ్వసనీయతను కోల్పోయిందని పేర్కొన్నారు.

వైయస్ఆర్ జిల్లా పేరును.. వైయస్ఆర్ కడప జిల్లాగా మార్పు

-చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్
-ఏపి కేబినేట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు

అమరావతి మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కేబినేట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. వైయస్ఆర్ జిల్లా పేరును.. వైయస్ఆర్ కడప జిల్లాగా మారుస్తున్నట్లు నిర్ణయం తీసుకుంది.ఎస్సి వర్గీకరణ అంశం పైనా కేబినేట్‌లో చర్చ జరిగింది. ఈ అంశంపై రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదికకు మంత్రివర్గం ఆమెదం తెలిపింది. వీటితో పాటు అమరావతిలో భూ కేటాయింపులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘాల నిర్ణయాలను ఆమోదముద్ర వేసింది. ఉపాధ్యాయుల బదిలీ నియంత్రణ చట్ట సమరణ బిల్లుకు కూడా ఆమోదం లభించింది. వీటితో పాటు కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు.

వేవ్స్-2025: మీడియా వినోద రంగాల్లోని అంకుర పరిశ్రమలకు సరికొత్త మార్గదర్శి

న్యూఢిల్లీ, మార్చి 20:మీడియా, వినోద రంగాల్లోని అంకుర పరిశ్రమలకు జాతీయ స్థాయి అవకాశాలు, గుర్తింపులతో పాటు సులభ పెట్టుబడుల అవకాశాలను కల్పించేందుకు కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ వేవెక్స్-2025 పేరిట ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. అఖిలభారత ఇంటర్నెట్, మొబైల్ సంస్థ 'ఐఏఎంఏఐ' సహకారంతో జరిగే ఈ కార్యక్రమం, మే 1 నుంచి 4 వరకూ ముంబయి జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగే వేవ్స్ (ప్రపంచ దృశ్య- శ్రవణ, వినోద సదస్సు)లో భాగంగా ఏర్పాటవుతుంది.

దేశ అంకుర పరిశ్రమలు ఈ రంగంలో పరివర్తనకు నేతృత్వం వహించేందుకు గాను వేవెక్స్-2025 చోదకశక్తిగా పనిచేస్తుంది. కార్యక్రమం ద్వారా అంకుర పరిశ్రమలకు అవగాహన పెంపొందటం, అవకాశాలు లభించడమే కాక, వ్యాపార అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు దక్కే అవకాశం కూడా ఉంది. కార్యక్రమంలో ఏర్పాటయ్యే ప్రత్యేక సమావేశాల్లో వెంచర్ క్యాపిటలిస్టులు, పేరొందిన ఏంజెల్ ఇన్వెస్టర్ల ఎదుట ప్రతిపాదనలుంచే అపురూపమైన అవకాశం అంకుర పరిశ్రమలకు దక్కుతుంది. కార్యక్రమాలు జాతీయస్థాయి టెలివిజన్ ప్రసారాల ద్వారా అసంఖ్యాకులకు చేరతాయి కాబట్టి అంకుర పరిశ్రమలకు విస్తృత స్థాయి గుర్తింపు దక్కుతుంది.

వేవెక్స్-2025... గేమింగ్, యానిమేషన్, ఎక్స్టెండెడ్ రియాలిటీ, మెటావర్స్, జెనరేటివ్ ఏఐ, నవీనతర కంటెంట్ వేదికలపై ప్రాథమికంగా దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమం పెట్టుబడుల కల్పనకే పరిమితమవక మెంటార్షిప్ అవకాశాలు, పెట్టుబడుల నెట్వర్కింగ్, దిగ్గజ మీడియా, టెక్ సంస్థలతో భాగస్వామ్య అవకాశాలను కూడా కల్పిస్తుంది. కార్యక్రమం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వెంచర్ క్యాపిటలిస్టులు, ఏంజెల్ ఇన్వెస్టర్లు, పరిశ్రమ నేతలు ఒక వద్దకు చేరి కలిసి ఆలోచనలు కలబోసుకునే అవకాశం కలుగుతుంది. వినోదం, సాంకేతికతల కలయికతో కంటెంట్ సృజన, పంపిణీ, వాడకం రూపురేఖలు మారిపోతాయి.

వేవెక్స్ కార్యక్రమంలో స్థూలంగా రెండు రకాల ఇన్వెస్ట్మెంట్ పిచింగ్ (పెట్టుబడుల కోసం చేసే ప్రతిపాదనలు) సెషన్లు ఏర్పాటవుతాయి మొదటి సెషన్లో అంకుర పరిశ్రమలు వెంచర్ క్యాపిటలిస్టులు, ఏంజెల్ ఇన్వెస్టర్ల ఎదుట తమ ప్రతిపాదనలు ఉంచుతాయి. ఇక రెండో సెషన్లో ఎంపిక చేసిన స్టార్ట్ అప్ లు పేరొందిన ఏంజెల్ ఇన్వెస్టర్ల బృందం ఎదుట తమ ఆలోచనలను ప్రదర్శిస్తాయి. ఈ కార్యక్రమం జాతీయ స్థాయి టెలివిజన్ ద్వారా ప్రసారం చేస్తారు కాబట్టి, పాల్గొంటున్న అంకుర పరిశ్రమలు అసంఖ్యాక ప్రేక్షకులను చేరే అవకాశం సహా వాటికి పెట్టుబడి అవకాశాలు కూడా విస్తృతమవుతాయి.

వేవెక్స్-2025 కార్యక్రమానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. వివిధ దశల వడపోతల అనంతరం అట్టహాసంగా జరిగే ఫైనల్స్ కోసం అత్యంత సమర్థవంతమని భావించే స్టార్టప్ లను ఎంచుకుంటారు. టెలివిజన్ ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమంలో ఈ అంకుర పరిశ్రమలు సెలెబ్రిటి ఏంజెల్ ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటలిస్టుల ఎదుట తమ ప్రతిపాదనలను గురించి వివరిస్తాయి. ఫైనల్ లో ఎంపికైన సంస్థలు, పరిశ్రమ నిపుణులు పాల్గొనే సమగ్రంగా అభివృద్ధివరచిన మెంటార్షిప్ కార్యక్రమాల లబ్ధి పొందే అవకాశం ఉంది, అంతేకాక, ఇన్వెస్టర్ నెట్వర్కింగ్ అవకాశాలను దక్కించుకునే అవకాశం, దిగ్గజ మీడియా, టెక్ సంస్థలతో భాగస్వామ్య అవకాశాలనూ అందిపుచ్చుకోవచ్చు.

మీడియా-టెక్ పరిశ్రమల కేంద్రంగా భారత్ కు గల గుర్తింపును వేవెక్స్ కార్యక్రమం మరింత బలపరుస్తుంది. ఏఐ-ఆధారిత కంటెంట్, డిజిటల్ మీడియా, కొత్తగా ఆవిర్భవిస్తున్న వినోదరంగ సాంకేతికతలను కార్యక్రమం వినియోగించుకుంటుంది. మీడియా-టెక్ రంగ సృజనాత్మకతలో భారత్ ను అగ్రగామి దేశంగా నిలపాలన్న ఆశయంతో, వ్యూహాత్మకంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన వేవ్స్ నోడల్ అధికారి వెల్లడించారు.

డిజిటల్ కంటెంట్, సాంకేతికతల్లో భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న నేపథ్యంలో అంకుర పరిశ్రమలు ఈ రంగంలో బలపడేందుకు వేవెక్స్-2025 గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది. జాతీయస్థాయి గుర్తింపు, పెట్టుబడులు, ఉన్నత స్థాయి మెంటార్షిప్ అవకాశాలను కోరుకునే వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

మీడియా, వినోద రంగాల్లో మైలురాయి వంటి తొలి వేవ్స్ సదస్సు (ప్రపంచ ఆడియో విజువల్, ఎంటర్టైన్మెంట్ సమిట్) ను భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ ఏడాది మే 1 నుంచి 4 వ తేదీ వరకూ ముంబయిలో నిర్వహిస్తారు.

మీరు పరిశ్రమలో సేవలందిస్తున్న నిపుణులైనా, సృజనకారులైనా, ఆవిష్కర్తలయినా, సదస్సు మీకు ప్రపంచ స్థాయి మీడియా, వినోద రంగాల్లో పని చేస్తున్న ఇతరులతో కలిసి పని చేసేందుకు, అనుసంధానమై మరింత తోడ్పాటును అందించేందుకు అవకాశాలని కల్పిస్తుంది.

కంటెంట్ సృష్టి, మేధోపరమైన హక్కులు, సాంకేతిక సృజనలో అగ్రగామి దేశంగా భారత్ స్థానాన్ని సుస్థిరం చేసేందుకు వేవ్స్ సదస్సు దోహదపడుతుంది. ప్రసార విభాగాలు, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, సినిమాలు, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, శబ్ద గ్రహణ-సంగీత రంగాలు, అడ్వర్టైజింగ్, డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలు, జెనరేటివ్ ఏఐ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఎక్స్టెండెడ్ రియాలిటీ తదితర రంగాల్లోని పరిశ్రమలపై సదస్సు దృష్టి కేంద్రీకరిస్తుంది.

సునీతా విలియమ్స్ యువతకు ఒక ప్రేరణ

-బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్రా అధ్యక్షురాలు ఏ. లత

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మహిళలు ఎందులో తీసి పోరణడానికి నిదర్శనం మహిళా వ్యోమగామి సునీతా విలియమ్స్ అని బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్రా అధ్యక్షురాలు ఏ. లత అన్నారు.ఆకాశమే హద్దు'' అని చెప్పడం సహజమే, కానీ దాన్ని నిజం చేసుకున్నవాళ్లు కొందరే! అలాంటి గొప్ప వ్యక్తుల్లో భారత సంతతి మహిళా వ్యోమగామి సునీతా విలియమ్స్ ఒకరు కావడం యావత్ భారత దేశానికి గర్వకా రణమన్నారు. ఆమె జీవిత ప్రయాణం యువతకు కేవలం ఒక గాథ కాదు, అదొక ప్రేరణఅని . ఆమె మనోధైర్యం, క్రమశిక్షణ, పట్టుదల ప్రపంచవ్యాప్తంగా లక్షల మందికి స్ఫూర్తినిచ్చాయన్నారు. 195 రోజులు స్పేస్‌లో గడిపి, ఆ సమయంలో మహిళా వ్యోమగామిగా అత్యధిక కాలం అంతరిక్షంలో గడిపిన ఘనత సాధించారన్నారు. సుమారు 50 గంటల 40 నిమిషాలు స్పేస్‌వాక్ చేసిన ఘనత సునీతా సొంతం. ఇది మహిళల విభాగంలో రికార్డు. ఐఎస్ఎస్ లో రన్నింగ్ ట్రెడ్‌మిల్ పై మారథాన్ పరుగు పూర్తి చేసిన తొలి వ్యక్తి గా రికార్డు సృష్టించారన్నారు .కష్టపడితే సాధ్యం కాదని, హెలికాప్టర్ పైలట్‌గా ప్రారంభమైన ఆమె ప్రయాణం, నాసా వ్యోమగామిగా మారడం వరకు ఇది కృషి, పట్టుదల వల్లే సాధ్యమైందన్నారు.

ఉచితాలు, సబ్సిడీలపై సభలో పకడ్బందీ చర్చ జరగాలి

-ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్

న్యూ డిల్లీ మార్చి 20(ఎక్స్ ప్రెస్ న్యూస్);ఉచితాలు, సబ్సిడీలపై సభలో పకడ్బందీ చర్చ జరగాలని ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్ బుధవారం అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెట్టుబడులు అన్నిటినీ విస్తృత శ్రేయస్సుకు దోహదపడేలా ఒక జాతీయ విధానాన్ని రూపొందించవలసిన తక్షణ అవసరం ఉందని ఆయన సూచించారు. అభివృద్ధి ప్రాజెక్టులు, పథకాల కోసం పార్లమెంట్ సభ్యుల వద్ద నిధులను ప్రస్తుత ఐదు కోట్ల రూపాయల నుంచి ఏడాదికి రూ. 20 కోట్లకు పెంచాలని జీరో అవర్‌లో సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) సభ్యుడు రామ్‌గోపాల్ యాదవ్ చేసిన అభ్యర్థనకు ధన్‌ఖడ్ స్పందిస్తూ, ప్రభుత్వం, ప్రతిపక్షం అంగీకరించి నట్లయితే ఈ అంశంపై పకడ్బందీ చర్చకు తాను సుముఖుడినేనని చెప్పారు. ఉచిత విద్యుత్, నీరు, సబ్సిడీ ధరకు వంట గ్యాస్ సరఫరా, రైతులు, మహిళలు వంటి కొన్ని బృందాలకు నగదు పంపిణీ వంటి ఎన్నికల ఉచితాల ప్రకటనను ప్రభుత్వంపై ఆర్థిక భారాలు మోపుతాయని, ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేస్తాయని, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలకు హానికరమని తరచు విమర్శలు వస్తున్న విషయం విదితమే.'ఉచితాలుగా తరచు పేర్కొంటున్న సంతృప్తిపరచే విషయాలపై ఈ సభ చర్చించవలసిన అగత్యం ఉంది. సభా నాయకుని, ప్రతిపక్ష నాయకుని సంప్రదించిన తరువాత పకడ్బందీ చర్చకు నేను సుముఖుడిని' అని సభాధ్యక్షుడు చెప్పారు. మూలధన వ్యయానికి ద్రవ్యం అందుబాటులో ఉన్నప్పుడే దేశం వృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. 'ఎన్నికల ప్రక్రియ ఎలా ఉందంటే ఇవి వోటర్లను ప్రలోభపెట్టేవిగా మారాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నట్లు గ్రహిస్తాయి. అవి తమ ఆలోచనలను మార్చుకోవలసి ఉంటుందని అనుకుంటుంటాయి' అని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. 'ఏ రూపంలోనైనా ప్రభుత్వ పెట్టుబడులు అన్నిటినీ విస్తృత శ్రేయస్సు కోసం పకడ్బందీ తరహాలో ఉపయోగించేలా ఒక జాతీయ విధానాన్ని రూపొందించవలసిన తక్షణ అగత్యం ఉంది' అని ఆయన సూచించారు. ఉభయ పక్షాల నేతలు అంగీకరించినట్లయితే చర్చించవచ్చునని ఆయన అన్నారు.ఇది అత్యంత తీవ్ర విషయమని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. అటుపిమ్మట ధన్‌ఖడ్ సబ్సిడీల అంశాన్ని ప్రస్తావించారు. 'వ్యవసాయ రంగం వంటి రంగాల్లో కావలసి ఉంటే సబ్సిడీలను నేరుగా అందజేయాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో అనుసరించే పద్ధతి అదే' అని ఆయన చెప్పారు. రెండు పక్షాలు అంగీకరిస్తే ఇది కూడా చర్చించవలసిన అంశమే అని ధన్‌ఖడ్ చెప్పారు. అంతకు ముందు రామ్‌గోపాల్ యాదవ్ మాట్లాడుతూ. ఎంపిల్యాడ్ నిధిని రూ. 20 కోట్లకు పెంచాలని, జిఎస్‌టి నుంచి మినహాయించాలని, అంచనాలు, జరిగిన పని నాణ్యత పరిశీలన కోసం ఒక సాంకేతిక విభాగాన్ని సృష్టించాలని కోరారు.

బడ్జెట్‌లో ఆడబిడ్డకు తీరని అన్యాయం: కెటిఆర్

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ విమర్శలు గుప్పించారు. బడ్జెట్‌లో తెలంగాణ ఆడబిడ్డకు తీరని అన్యాయం చేశారని ఆయన అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు గోవిందా అని అర్థమైందని పేర్కొన్నారు. ఏడాది దాటిన ఉద్యోగాల ఊసే లేదని.. బిఆర్ఎస్ హయాంలో వచ్చిన నోటిఫికేషన్లు తామే ఇచ్చినట్లు కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారని తెలిపారు.ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం, మహిళలకు నెలకు రూ. 2వేలు, రూ. 4వేలు పెన్షన్లు ఇస్తామన్న పాతరేశారని మండిపడ్డారు. కులగణన సర్వే పేరుతో వెనుకబడిన వర్గాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు.

దివ్యాంగులు కూడా చదువులో రాణించాలి:టి.శ్రీనివాస్

నిజామాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్); దివ్యాంగులు కూడా చదువులో రాణించాలని దుబ్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. శ్రీనివాస్ అన్నారు.SSA మరియు' .ALIMCO ' వారి సౌజన్యంతో ''దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరంలో ఆయన ముఖ్య అతిధి గా పాల్గొని దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ చేశారు.

దుబ్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7 వ తరగతి విద్యార్థిని కుమారి నమ్రత కు శ్రవనోపకరణం తల్లి దండ్రుల సమక్షంలో వాటిని ప్రదానం చేశారు.

వీటిని ఉపయోగించి చదువులో రాణించాలని అన్నారు. ఇందులో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు R.B.V. రాజు I.E.R.P.లక్ష్మణ్,ఉ సంతోష్ ,బి.వినీత్ కుమార్, టి. కేశవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డు కులాల్లో పారిశ్రామిక స్ఫూర్తి, సృజనాత్మకతలను పెంచే పథకాలు

న్యూఢిల్లీ, మార్చి 20:షెడ్యూల్డు కులాలకు చెందిన వారిలో పారిశ్రామిక స్ఫూర్తి, సృజనాత్మకతలను పెంచేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టింది. షెడ్యూల్డు కులాల కోసం ప్రత్యేకంగా రూ. 750 కోట్లతో వెంచర్ క్యాపిటల్ నిధి (వీసీఎఫ్?ఎస్సీ)ని ప్రారంభించింది. తద్వారా రూ.10 లక్షల నుంచి రూ. 15 కోట్ల వరకూ రాయితీతో కూడిన రుణాలను 4 శాతం వడ్డీకే అందిస్తోంది. ఈ నిధిని ఐఎఫ్సీఐ వెంచర్ క్యాపిటల్ సంస్థ నిర్వహిస్తోంది.

టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (టీబీఐ), అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాల (ఏఐసీ)కు చెందిన ఎస్సీ విద్యార్థులకు, పరిశోధనకారులకు, పారిశ్రామికవేత్తలకు అంబేద్కర్ సామాజిక సృజన ఇంక్యుబేషన్ పథకం (ఏఎస్ఐఐఎం) దన్నుగా నిలుస్తోంది. ఏఎస్ఐఐఎం కింద, వ్యవసాయ సాంకేతికత, ఐటీ, పర్యావరణం, వ్యర్థ నిర్వహణ, హరిత ఇంధనం వంటి రంగాల్లోని అంకుర పరిశ్రమలకు సహాయపడేందుకు మూడు సంవత్సరాలలో రూ. 30 లక్షల ఈక్విటీ నిధులను అందిస్తారు. ఇప్పటివరకూ ఏఎస్ఐఐఎం సహా వీసీఎఫ్ఎస్సీ ద్వారా 245 ఎస్సీల ఆధ్వర్యంలోని కంపెనీలకు రూ. 588.4 కోట్ల మేర నిధులను అందించారు.

ఎస్సీ సముదాయానికి వ్యాపారాలు, అంకుర పరిశ్రమల ఏర్పాటు సులభతరం చేసేందుకు సోషల్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం లేనప్పటికీ, ప్రస్తుతం అమల్లో ఉన్న ఏఎస్ఐఐఎం, వీసీఎఫ్?ఎస్సీ వంటి కార్యక్రమాల ద్వారా పారిశ్రామిక స్ఫూర్తి, సృజనలకు ప్రోత్సాహాన్ని కొనసాగిస్తోంది. అంతేకాక, 'పీఎం సూరజ్' ద్వారా అందించే రుణాలు సులభంగా అందేందుకు చర్యలు తీసుకుంటోంది. పీఎం సూరజ్... సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖలోని అన్ని సమ్మిళిత ఆర్థిక పథకాల ఏకీకృత డిజిటల్ వేదికగా సేవలందిస్తోంది. షెడ్యూల్డు కులాల, ఇతర వెనుకబడిన సమూహాల కోసం వ్యాపార యంత్రాంగాన్ని బలోపేతం చేసేందుకు మెంటార్షిప్ మద్దతు, మార్కెట్ అనుసంధానాన్ని సమకూరుస్తోంది.

ఈరోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన కేంద్ర సాంఘిక న్యాయం, సాధికారతల మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ ఈ సమాచారాన్ని అందించారు.

మహారాష్ట్ర జేఎన్పీఏ పోర్టు (పాగోటే) నుంచి చౌక్ వరకూ 29.219 కిలోమీటర్ల 6-లేన్ల కొత్త నియంత్రిత రహదారి నిర్మాణానికి కేబినెట్ ఆమోదం : బీఓటీ (టోల్) పద్ధతిలో ప్రాజెక్టు నిర్మాణం

న్యూఢిల్లీ, మార్చి 20:మహారాష్ట్ర జేఎన్పీఏ పోర్టు (పాగోటే) నుంచి చౌక్ వరకు 29.219 కిలోమీటర్ల 6-లేన్ల కొత్త నియంత్రిత రహదారి నిర్మాణానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఏర్పాటైన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం ఆమోదం తెలిపింది. రూ. 4500.62 కోట్ల ఖర్చు కాగల ఈ ప్రాజెక్టును 'నిర్మాణం-నిర్వహణ-బదిలీ' పద్ధతిలో నిర్మిస్తారు.పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ సూత్రాల కింద, సమీకృత మౌలిక సదుపాయాల ప్రణాళికల్లో భాగంగా నిర్మించే రహదారులను దేశంలోని చిన్న, పెద్ద ఓడ రేవులతో అనుసంధానించేందుకు ప్రాధాన్యమిస్తారు. జేఎన్పీఏ రేవులో పెరుగుతున్న రద్దీ, నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాల దృష్ట్యా ఈ ప్రాంతంలో జాతీయ రహదారులకు అనుసంధానాన్ని పెంచవలసిన అవసరాన్ని గుర్తించారు. ప్రస్తుతం 48వ నెంబరు జాతీయ రహదారిలోని కీలక గోలైన్ క్వాడ్రీ లేటరల్ ప్రాంతం నుంచీ జేఎన్పీఏ రేవు వరకూ.. ముంబయి, పూణే ఎక్స్ప్రెస్ వే లపై చేపట్టే ప్రయాణానికి 2-3 గంటల సమయం పడుతోంది. పలస్పే ఫటా, డీ- పాయింట్, కాలంబోలి జంక్షన్, పన్వెల్ వంటి నగర ప్రాంతాల్లో రోజుకి 1.8 లక్షల పీసీయూ (రోజుకి ఒక తోవలో తిరుగాడే కార్లు)కన్నా అధికమైన ట్రాఫిక్ నమోదవుతోంది. ఈ సంవత్సరం నవీ ముంబయి విమానాశ్రయ కార్యకలాపాలు ప్రారంభమైన అనంతరం ప్రత్యక్ష రహదారి అనుసంధాన అవసరాలు మరింత పెరగవచ్చని భావిస్తున్నారు.దాంతో, ఈ ప్రాజెక్టు నిర్మాణం రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించడం సహా జేఎన్పీఏ రేవు, నవీ ముంబయిల మధ్య రవాణా సామర్థ్యాన్ని మెరుగుపరచగలదని ఆశిస్తున్నారు.

ఈ ప్రాజెక్టు జేఎన్పీఏ రేవు (348వ నెంబరు జాతీయ రహదారి పాగోటే గ్రామం) వద్ద మొదలై ఎన్ హెచ్-48 పైన గల ముంబయి-పూణే హైవే వద్ద ముగుస్తుంది. ఈ రహదారి ముంబయి-పూణే ఎక్స్ప్రెస్ వే , ముంబయి గోవా జాతీయ రహదార్లను (ఎన్ హెచ్-66) కూడా కలుపుతుంది.వ్యాపారం నిమిత్తం తిరిగే భారీ కంటెయినర్ వాహనాలు సులభంగా ప్రయాణించేందుకు సహ్యాద్రి కొండల్లోని రెండు సొరంగ మార్గాలను అందుబాటులోకి తెస్తారు.. దాంతో కొండ ప్రాంతాల్లో ఎగుడుదిగుడు మార్గాల్లో ప్రయాణం వల్ల జరిగే జాప్యం తగ్గి, వాహనాలు త్వరితగతిన గమ్యాన్ని చేరుకోగలవు.

కొత్త 6-మార్గాల గ్రీన్ ఫీల్డ్ రహదారి ప్రాజెక్టు సురక్షితమైన, సమర్థవంతమైన సరుకుల రవాణాకు దోహదపడుతుంది.

విద్యార్థులే కేంద్రంగా విద్యాబోధన జరగాలి- మను చౌదరి

మెదక్, మార్చి 20: విద్యార్థులే కేంద్రంగా విద్యా బోధన జరగాలని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు. గురువారం కోహెడ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ? 50లక్షల రూపాయలతో శనిగరం, కోహెడ, అంతక్కపేట జెడ్పి హైస్కూల్ లలో ల్యాబ్ ను ఏర్పాటు చేసేందుకు సహకరించిన టిఎస్ ఐజీ డైరెక్టర్ అర్చన సురేష్, సేల్స్ ఫోర్సెస్ సంస్థ ప్రతినిధి కిరణ్ మయి, నిర్మాణ్ ఎన్జీఓ ప్రతినిధి మధురీ కనకాలకు ధన్యవాదములు తెలిపారు.

విజ్ఞానాన్ని అందించడంలో వార్త పత్రికలు ముందుంటాయని, ప్రతిరోజూ ఒక తెలుగు లేదా ఇంగ్లీష్ వార్త పత్రికను కనీసం 15నిముషాలు చదవాలని, మీరు చెప్పదలుచుకున్నది ఏ భాషలోనైనా కాన్ఫిడెన్స్ గా చెప్పాలన్నారు. మీరు చేప్పే దానిని బట్టి మీ వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తారని విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో ఎక్కువగా స్టేజ్ మీద మాట్లాడించాలని, విద్యార్థులతో స్టేజ్ మీద మాట్లాడిస్తే వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని, విద్యార్థులు కేంద్రంగా విద్యా బోధన జరగాలని ఉపాధ్యాయులకు సూచించారు. రేపటి నుండి ప్రారంభమవుతున్న 10వ తరగతి పరీక్షల్లో అందరూ పాస్తై 10జీపీ సాధించాలని విద్యార్థులకు సూచించారు.

తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్ మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ తమ జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ నాలెడ్జ్ అందించేందుకు సహకారం కోరడంతో సేల్స్ ఫోర్సెస్, నిర్మాన్ ఎన్జీఓల సహకారంతో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, కోహెడ తహసీల్దార్ సురేఖ, ప్లానింగ్ అండ్ ఎంఐఎన్ కో ఆర్డినేటర్ రామస్వామి, ఎంఈఓ పద్మయ్య, పాఠశాల హెచ్ఎం, నిర్మాన్, సేల్స్ ఫోర్సెస్ ఆర్గనైజేషన్స్ ప్రతినిధులు కిరణ్ మయి, మాధురి, పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్లో భోజనం వికటించి 23 మంది విద్యార్థులు అస్వస్థత

నిజామాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);వర్ని మండలం కోటయ్య క్యాంప్ ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్లో బుధవారం భోజనం వికటించడంతో 23 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థినిలు ఉదయం అల్పాహారం తీసుకున్న కొద్దిసేపటి తర్వాత కొంత మంది విద్యార్థినిలకు కడుపు నొప్పి, వికారంగా అనిపించడంతో హాస్టల్ వార్డెన్ శిరీషకు తెలిపారు. ఫుడ్ పాయిజన్ అయిన వారిలో ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థినిలు ఎస్ఎన్పురం గర్ల్స్ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఆమె వెంటనే వర్ని ప్రభుత్వ ఆసుపత్రికి విద్యార్థినిలు తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది 23 మంది విద్యార్థినిలకు అడ్మిట్ చేసుకున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ తెలిపారు. 23మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ట్రీట్మెంట్ అందించామని ఆమె పేర్కొన్నారు. ఈవిషయం మీడియా ప్రతినిధులు తెలుసుకొని ఆస్పత్రికి వెళ్ళగా హాస్టల్ సిబ్బంది ఫోటోలు తీయవద్దని అడ్డుకొని విద్యార్థినిలను హాస్టల్ సిబ్బంది ఆసుపత్రి నుంచి తీసుకెళ్లారు. వార్డెన్‌కు పిల్లల అస్వస్థతపై వివరణ కోరకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించారు. ఇవ్వకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. మెడికల్ ఆఫీసర్ వివరణ కోరగా 23 మంది విద్యార్థులకు ఆస్పత్రిలో పరీక్షించామని ఫుడ్ పాయిజన్‌తోనే ఇలా అయిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. ఎంఈఓ డి. సాయిలను వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చూడగా రెండు గంటలు అక్కడనే ఉండి విద్యార్థినిలకు మెరుగైన వైద్య పరీక్షలు చేయించామని ఎంఈఓ తెలిపారు.

బెట్టింగ్ యాప్స్ ప్రమోట్, రానా, ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండపై కేసులు నమోదు

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన నటులు యూట్యూబర్లపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నటులు దగ్గుబాటి రానా, ప్రకాష్ రాజ్, విజయ్ దేవరకొండ యాంకర్ శ్యామల మొత్తం 25 మందిపై కేసు నమోదు చేశామని మియాపూర్ పోలీసులు వెల్లడించారు. మియాపూర్ ప్రగతి ఎన్ క్లేవ్‌లో నివాసం ఉంటున్న ప్రమోద్ శర్మ ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేసిన వారిపై 318 (4) బీఎన్ఎస్,3,3(ఎ),4 టీఎన్జీఎ,66డి ఐటీఏ చట్టం -2008 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సమాచారం. నటులు, యూట్యూబర్స్ కు ఫాలోవర్స్ అధికంగా ఉండడంతో పైసలకు ఆశపడి యువతను తప్పుదోవ పట్టించే విధంగా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారని నెటిజన్లు మండిపడుతున్నారు. గతంలో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన యూట్యూబర్లు, నటులు ఇమ్రాన్ ఖాన్, హర్ష సాయి, టెస్టీ తేజ, కిరణ్ గౌడ్, విష్ణుప్రియ, శ్యామల, రీతూ చౌదరి, బండారు షేషయాని సుప్రిత, అజయ్, సన్నీ, సుధీర్‌లపై కేసులు నమోదైన విషయం తెలిసిందే.

స్నేహితురాలిపై తన ప్రియుడితో ఓ యువతి అత్యాచారం

-సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలంలో దారుణం

హుజూర్ నగర్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలంలో దారుణం వెలుగులోకి వచ్చింది. స్నేహితురాలిపై తన ప్రియుడితో ఓ యువతి అత్యాచారం చేయించి వీడియో తీసింది.

ఓ యువతి తన స్నేహితురాలు (26) ని ఇంటికి పిలిచి మద్యం తాగించి మత్తులోకి దించింది. అనంతరం తన ప్రియుడు ప్రమోద్ తో ఆమెపై అత్యాచారం చేయిస్తూ వీడియో తీసింది.

మరొకసారి యువతిని ఇంటికి పిలుపించుకొని ఈసారి తన స్నేహితుడు హరీష్ కోరిక తీర్చాలని స్నేహితురాలిని అడిగింది. స్నేహితురాలు నిరాకరించడంతో ఆమెపై సదరు యువతి దాడి చేయడంతో వీడియోలు వైరల్ చేస్తానని బ్లాక్ మెయిల్ చేసింది. దీంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి సదరు యువతి, ప్రమోద్, హరీష్ ను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం ఆర్ కృష్ణయ్య కృషి ఫలితమే..

-బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణి శ్రీకాంత్

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కృషి ఫలితమే నని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణి శ్రీకాంత్ పేర్కొన్నారు. బీసీల హక్కుల కోసం బీసీ సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న ఆరు కృష్ణయ్య తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణకు ముందు కూడా గత ప్రభుత్వాన్ని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలుమార్లు బీసీలకు రిజర్వేషన్లు కావాలని చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు కావాలని బీసీల జనాభా లెక్కంచాలని ఎన్నోసార్లు రాష్ట్రస్థాయిలో జాతీయ స్థాయిలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు వినతి పత్రాలు, దార్నాలు,నిరసనాలు తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాని ప్రయత్న ఫలితమే ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభల బిల్లు ప్రవేశపెట్టిందని శ్రావణి శ్రీకాంత్ తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ఆర్ కృష్ణయ్య గారికి ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం ఆర్ కృష్ణయ్య కృషి ఫలితమే..

- బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణి శ్రీకాంత్

హైదరాబాద్ మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కృషి ఫలితమే నని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణి శ్రీకాంత్ పేర్కొన్నారు.

బీసీల హక్కుల కోసం బీసీ సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న ఆరు కృష్ణయ్య తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణకు ముందు కూడా గత ప్రభుత్వాన్ని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలుమార్లు బీసీలకు రిజర్వేషన్లు కావాలని చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు కావాలని బీసీల జనాభా లెక్కంచాలని ఎన్నోసార్లు రాష్ట్రస్థాయిలో జాతీయ స్థాయిలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు వినతి పత్రాలు, దార్నాలు,నిరసనాలు తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాని ప్రయత్న ఫలితమే ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభల బిల్లు ప్రవేశపెట్టిందని శ్రావణి శ్రీకాంత్ తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ఆర్ కృష్ణయ్య గారికి ధన్యవాదాలు తెలిపారు.

నాగులవంచలో చలివేంద్రం ఏర్పాటు



ఖమ్మం, మార్చి 20:చింతకాని మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని బస్టాండ్ వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఖమ్మం-బోనకల్లు ప్రధాన రోడ్డు మార్గం కావడంతో నిత్యం ప్రయాణికుల రద్దీ ఉంటుంది. వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.చిరంజీవి తెలిపారు. బాటసారులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలాగే బస్టాండ్ వరినర వెంకటేశ్వర్లు, పడిశాల యశోద, షేక్ ప్రాంతాల్లో వ్యర్థ పదార్థాలు వేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం అంబటి శాంతయ్య, పంచాయతీ సిబ్బంది దేశబోయిన కొండలు, భహోటం ఫణిరాజు, కందిమళ్ల బుచ్చిబాబు, పడిశాల గోపి, మంద రాజ్‌కుమార్, తురక బాషా సాహెబ్, ఓర్సు పుష్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వంట సామగ్రి పంపిణీ చేసిన పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి

మహబూబాబాద్, మార్చి 20: (నేటినిజం ప్రతినిధి):పెద్దవంగర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వంట సామగ్రిని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, పాఠశాలకు వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం మహబూబాబాద్ జిల్లాలోని 557 ప్రభుత్వ పాఠశాలలకు రూ. 75 లక్షల విలువైన వంట సామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పెద్దవంగర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ సామగ్రిని అందజేశామని,మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కూడా త్వరలోనే ఈ వంట సామగ్రిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ చర్యల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన భోజన సదుపాయం లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే చేస్తున్న కార్యక్రమాలపై ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్,ఉపాధ్యక్షులు రంగు మురళి గౌడ్, నాయకులు ముత్యాల పూర్ణచంధర్, గోపాల్ నాయక్, మండల బీసీ సెల్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, పొడిశెట్టి సైదులు,మహిళా మండల అధ్యక్షులు చిలుక దేవేంద్ర, వల్లపు లావణ్య, స్వాతి, గ్రామ పార్టీ అధ్యక్షులు గద్దల ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను నా దృష్టికి తీసుకురావాలి.. అక్రమ మట్టి రవాణాను అడ్డుకోండి : ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

మెదక్, మార్చి 20: స్వచ్ఛంద సంస్థల పేరుతో చెరువు, కుంటల నుండి తరలిస్తున్న అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఇవాళ నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నియోజకవర్గంలోని మండలాల నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామస్తులకు, రైతులకు కాకుండా అక్రమంగా చెరువులోని, కుంటల్లోని మట్టిని తరలిస్తే అనుమతులను రద్దు చేయాలని ఆదేశించారు. అధికారులకు, తనకు ఎలాంటి సమాచారం లేకుండానే అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలోని చెరువు, కుంటలకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత మంత్రితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని వెల్లడించారు.కాళేశ్వరం కాలువ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, కాలువ పనులు పూర్తయితే మల్లన్న సాగర్, కొండపోచమ్మ నుండి సాగునీరు వస్తాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలోనే మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు, కుంటలు బాగుపడ్డాయని ఇప్పుడు స్వచ్ఛంద సంస్థల పేరుతో మట్టిని తీసి చేసేది ఏమీ లేదని అన్నారు.

అనంతరం నియోజకవర్గ స్థాయి మండలాల ఇరిగేషన్ అధికారులతో చెరువు, కుంటల సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ వెంకటనర్సింగరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఇరిగేషన్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమంలో వైభవంగా అధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

బాసర మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపములో శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమము(కోటి పార్థివలింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము) మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమములు, అధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవం గా జరిగినవి. ముందుగా దీపారాధన,కలశస్థాపన, పుణ్యాహవచనము ,లక్ష్మీ గణపతి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య, కోటి పార్థివ లింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకము , కుంకుమార్చన ,గణపతి, నవగ్రహ ,రుద్ర ,సరస్వతి హోమములు, భూదాన సంకల్ప పూజ, మరియు అన్నదానము ఘనంగా జరిగింది..సాంస్కృతిక కార్యక్రమములో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన , 1 సంభాషణ సంస్కృత మాస పత్రిక సంపాదకులు, సంస్కృత ఉపన్యాసకులు డా రాజేంద్ర ప్రసాద్ కు ఉత్తమ ఆధ్యాత్మిక సేవ పురస్కారం మరియు నాట్య గురువులు హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ కృష్ణవేణి కళా నిలయం అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు , నాట్య గురువులు కాంచన, శ్రీ నాట్యం డ్యాన్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు నాట్య గురువులు విజయలక్ష్మి లకు ఉత్తమ సాంస్కృతిక నాట్య సేవా పురస్కారము శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీనిర్మల సంధ్య అంబికానాథ శర్మ దంపతులు అందజేసినారు. ఉత్తమ ఆధ్యాత్మిక భక్తి సేవ పురస్కార గ్రహీత డా రాజేంద్ర ప్రసాద్ సభలో మాట్లాడుతూ బాసర సరస్వతి క్షేత్రములో ఈ పురస్కారం తీసుకోవడము ఆనందము గా మరియు గర్వము గా ఉన్నదని మరియు బాసర సరస్వతి దేవాలయం సన్నిధి లో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రతి నెల మాసోత్సవము భాగము గా పూజ కార్యక్రమములు, సంగీత, సాహిత్య,నృత్య, ధార్మిక , ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని ప్రశంసించారు. ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ సభలో మాట్లాడుతూ ఏప్రిల్ 20 వతేదీ న బాసర సరస్వతి క్షేత్రము లో శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ మహాసోత్సవం సందర్భమూ గా భరత నాట్య, కూచిపుడి నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నామని ఆసక్తి గల నాట్య గురువులు 9948332032 ఈ నెల 25 లోపు సంప్రదించి మీ సంస్థ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. నాట్య గురువుల శిష్యులు చేసిన నాట్యము చూపురులను ఆకుట్టుకుంది. మరియు బొల్లాప్రగడ శశిశర్మ అష్టావధానం నిర్వహించారు .నిర్మల్ పట్టణ వాస్తవ్యులు ప్రముఖ వ్యాపారవేత్త నూకల దయాకర్ మాధవి దంపతులు, నిజమాబాద్ పట్టణ వాసులు వ్యాపార వేత్త దొంతుల చంద్రశేఖర్, ధనలక్ష్మి దంపతులు కోమటి కొండాపురం వాస్తుపులు పల్లికొండ శ్రీనివాస్ స్వప్న దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా ఇఫ్తార్ విందు ఇస్తూనే ఉంటా : ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

మెదక్, మార్చి 20:అధికారంలో ఉన్న లేకున్నా ప్రతి ఏడాది ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇస్తూనే ఉంటానని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి వెల్లడించారు. ఇవాళ నర్సాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఇఫ్తార్ విందు ఇస్తూనే ఉన్నానని ముస్లిం ప్రజల ఆశీర్వాదాలు నాపై ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

731 సర్వే నెంబర్‌లో గ్రేవ్‌యార్డుకు ఐదు ఎకరాల స్థలం ఇవ్వడం జరిగిందని, అది ప్రాసెస్‌లో ఉందని తెలిపారు. వైనార్టీ మహిళలకు ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. అలాగే రెసిడెన్షియల్ స్కూల్, డబుల్ బెడ్ రూమ్ లకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముస్లిం ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మనియుద్దీన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, లేబర్ వెల్ఫేర్ బోర్డ్ మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంతోష్ రెడ్డి, శశిధర్ రెడ్డి, చంద్ర గౌడ్, మన్సూర్ హరికృష్ణ అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస పథకం అందరికీ వర్తింపజేయాలి : గౌని నాగేశ్వరరావు

ఖమ్మం, మార్చి 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అందరికీ వర్తింపజేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. పథకానికి సంబంధించి ప్రభుత్వం నిబంధనలు సడలించాలని కోరుతూ జూలూరు పాడు తాసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పాండేకి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం నిబంధనలతో కూడుకొని ఉండటం వల్ల చాలామంది నిరుద్యోగులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలను సడలించాలన్నారు. రేషన్ కార్డులు, బ్యాంకు సూరిటీలు, ఇంటర్వ్యూల విషయంలో సడలింపులు ఇవ్వాలన్నారు.

రేషన్ కార్డులు ఇవ్వలేని ప్రభుత్వాలు, ఉద్యోగాలు అడిగితే ఇవ్వలేని ప్రభుత్వాలు తమ పథకాన్ని ఉపయోగించుకోండి.. లోన్ తీసుకోండి.. షాపులు పెట్టుకోండి అని ఉద్యోగాల వైపు కాకుండా, ప్రశ్నించే తత్వం వైపు కాకుండా, వ్యాపారం వైపు బానిసలుగా చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ప్రకటించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అప్పుడు మాత్రమే ఈ రాజీవ్ వికాస పథకం వికసిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వల్లోజి రమేశ్, గోపి, వేణు, నరసింహారావు పాల్గొన్నారు.

సవరించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ అమలుకు మంత్రిమండలి ఆమోదం 2024-25, 2025-26 సంవత్సరాలకు కేటాయింపు పెంపు

న్యూఢిల్లీ, మార్చి 20:పశుగణం రంగంలో వృద్ధికి ఊతమివ్వడానికి సవరించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎమ్)కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. సవరించిన ఆర్‌జీఎమ్‌ను రూ.1000 కోట్ల అదనపు వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పథకంలో కేంద్ర వాటా కింద అమలు చేయనున్నారు. 2021-22 మొదలు 2025-26 సంవత్సరాలకు వర్తించే 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం ఈ పథకానికి మొత్తం రూ.3400 కోట్లు ఖర్చు చేయనున్నారు.

రెండు కార్యకలాపాలను కొత్తగా అమలు చేయనున్నారు. వాటిలో ఒకటోది చిన్న వయస్సు గల ఆవుల సంరక్షక కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అయ్యే మూలధన వ్యయంలో నుంచి 35 శాతాన్ని ఒకసారి సాయంగా నిర్దిష్ట ఏజెన్సీలకు అందిస్తారు. మొత్తం 15000 ఆవుదూడలకు 30 పాలన, పోషణ నిలయాలను ఈ ఏజెన్సీలు నెలకొల్పుతాయి. ఇక రెండోది.. ఉన్నత అనువంశకత కలిగిన కృత్రిమ గర్భధారణ (ఐవీఎఫ్) మార్గంలో ఉత్పత్తి చేసిన పెయ్య దూడలను కొనుగోలు చేసేదిశగా రైతులను ప్రోత్సహించడం. దీనికోసం పాల సంఘాల నుంచి గాని, ఆర్థిక సంస్థల నుంచి గాని, బ్యాంకుల నుంచి గాని రైతు తీసుకునే రుణానికి చెల్లించాల్సిన వడ్డీలో 3 శాతం వడ్డీని ప్రభుత్వమే చెల్లించే (ఇంటరెస్ట్ సబ్‌వెన్షన్) వెసులుబాటును సమకూర్చడం. ఈ చర్య అధికంగా పాలిచ్చే తరహా జాతులను వ్యవస్థలో భాగం చేయడానికి తోడ్పడుతుంది.

పదిహేనో ఆర్థిక సంఘం సిఫారసులు వర్తించే కాలంలో, అంటే 2021-22 మొదలు 2025-26 మధ్య రూ.3400 కోట్ల కేటాయింపుతో సవరించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ను ఆమోదించారు.

రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా ప్రస్తుతం చేపడుతున్న కార్యకలాపాలను కొనసాగించడానికే ఈ పథకాన్ని ఉద్దేశించారు. మిషన్ కార్యకలాపాల్లో వీర్య కేంద్రాలను (సీమెన్ స్టేషన్స్), కృత్రిమ గర్భధారణ నెట్‌వర్కును బలోపేతం చేయడం, ఎద్దుల ఉత్పత్తి కార్యక్రమాన్ని అమలుపరచడం, లింగ నిర్ధారిత వీర్య పద్ధతిని ఉపయోగించి తక్కువ కాలంలో ఎక్కువ పశుగణాభివృద్ధిని సాధించే కార్యక్రమాన్ని అమలు చేయడం, నైపుణ్యాభివృద్ధి, రైతుల్లో చైతన్యాన్ని ప్రోది చేయడం, శ్రేష్ఠత్వ కేంద్రాలను (సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) ఏర్పాటు చేయడం సహా వినూత్న కార్యకలాపాలకు మద్దతివ్వడం, కేంద్రీయ పశుగణ పెంపక క్షేత్రాలను (సెంట్రల్ క్యాటిల్ బ్రీడింగ్ ఫారమ్స్) పటిష్టపరచడంతోపాటు ఈ తరహా కార్యకలాపాలకు ఇప్పుడు అందిస్తున్న సహాయానికి సంబంధించిన నియమనిబంధనలలో ఎలాంటి మార్పు చేయకుండానే ఈ పటిష్టీకరణను చేపట్టడం.. వంటివి భాగంగా ఉన్నాయి.

రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ను అమలు చేయడంతోపాటు ప్రభుత్వం చేపడుతున్న ఇతరత్రా కృషి మూలంగా, పాల ఉత్పత్తి గత పది సంవత్సరాల్లో 63.55 శాతం మేర పెరిగింది. తలసరి పాల లభ్యత సైతం హెచ్చింది. 2013-14లో తలసరి పాల లభ్యత రోజుకు 307 గ్రాములు ఉండగా, 2023-24లో రోజుకు 471 గ్రాములకు చేరుకొంది. ఉత్పాదకత కూడా గత పదేళ్లలో 26.34 శాతానికి వృద్ధి చెందింది.

రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎమ్)లో భాగంగా ఉన్న దేశవ్యాప్త కృత్రిమ గర్భధారణ కార్యక్రమం (ఎన్ఏఐపీ) భారత్ అంతటా 605 జిల్లాల్లో రైతుల ఇళ్ల ముంగిటే కృత్రిమ గర్భధారణను (ఏఐ) ఉచితంగా అందిస్తారు. అయితే ఈ సౌకర్యాన్ని బేస్‌లైన్ ఏఐ కవరేజీ 50 శాతం కన్నా తక్కువగా ఉన్న ప్రాంతాలకే అందిస్తారు. ఇంతవరకు, 8.39 కోట్లకు పైగా పశువులను లెక్కలోకి తీసుకున్నారు. 5.21 కోట్ల మంది రైతులకు ప్రయోజనం లభించింది. పశు జననాలకు సంబంధించి అత్యధునాతన సాంకేతికతను ఆచరణలోకి తీసుకురావడంతోపాటు దానిని రైతుల ఇళ్ల ముంగిటకు తీసుకురావడంలోనూ ఆర్‌జీఎమ్ అగ్రగామిగా ఉంది. దేశవ్యాప్తంగా రాష్ట్ర పశుగణ మండళ్ల (ఎస్ఎల్‌బీస్) ఆధ్వర్యంలో గాని, విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో గాని మొత్తం 22 ఇన్ విట్రో ఫర్టిలైజేషన్ (ఐవీఎఫ్) ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. 2541 కన్నా ఎక్కువ హై జెనెటిక్ మెరిట్ కలిగిన (హెచ్‌జీఎమ్) దూడలు పుట్టాయి. స్వయంసమృద్ధ సాంకేతికతలో గౌ చిప్, మహిష్ చిప్ రూపంలో రెండు ప్రధానమైన అడుగులు పడ్డాయి. ఇవి జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి మండలి (ఎన్‌డీడీబీ), ఐసీఏఆర్‌కు చెందిన జాతీయ పశు ఆనువంశిక వనరుల మండలి (నేషనల్ యానిమల్ జెనెటిక్ రిసోర్సెస్ బ్యూరో.. ఎన్‌బీఏజీఆర్) అభివృద్ధిచేసిన స్వదేశీ గోజాతి పశువులకు ఉద్దేశించిన జీనోమిక్ చిప్స్. ఎన్‌డీడీబీ అభివృద్ధి చేసిన గౌ సార్ట్ దేశీయంగా రూపొందించిన లింగ నిర్ధారిత వీర్య ఉత్పాదన సంబంధిత సాంకేతికత. ఈ పథకం పాల ఉత్పత్తిని చెప్పుకోదగ్గ స్థాయిలో పెంచనుంది. ఉత్పాదకతతో పాటు అంతిమంగా రైతుల ఆదాయాలను కూడా మెరుగుపరచనుంది. భారతదేశంలో దేశవాళీ ఎద్దుల ఉత్పాదనలో సువ్యవస్థిత, శాస్త్రీయ ప్రయత్నాలపైన, స్వదేశీ గోజాతి సంబంధిత జీనోమిక్ చిప్స్‌ను అభివృద్ధిపరచడం ద్వారా స్వదేశీ గోజాతి వంశక్రమాల శాస్త్రీయ సంరక్షణ, పరిరక్షణలపైన కూడా ఈ పథకం దృష్టిని కేంద్రీకరించనుంది. దీనికి అదనంగా, ఈ పథకంలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల వల్ల ఇన్ విట్రో ఫర్టిలైజేషన్ (ఐవీఎఫ్) ఒక సువ్యవస్థిత టెక్నాలజీ రూపాన్ని సంతరించుకొంది. ఈ కార్యక్రమం ఉత్పాదకతను పెంచడం ఒక్కటే కాకుండా, 8.5 కోట్ల మంది పాడి రైతులకు మేలు చేస్తుంది.

కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువే కారణం : కేటీఆర్

సూర్యాపేట మార్చి 20: ఇవాళ తెలంగాణ వ్యాప్తంగా పంటలు ఎండుతున్నాయి అంటే కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి పాపమే రైతన్నకు శాపంలా మారిందని పేర్కొన్నారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

రైతులకు రావాల్సిన 37 వేల కోట్ల రూపాయలు ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఖర్గే ఖాతాల్లో టింగు టింగు మని పడుతున్నాయి. కేసీఆర్ కాంగ్రెస్ సన్నాసులను నమ్మితే రైతుబంధుకి రామ్ రామ్ అయితదని ముందే చెప్పిండు. అదే ఇవాళ జరిగింది. నీళ్ల మంత్రి నల్లగొండలోనే ఉన్నా చుక్కనీరు తేలేకపోతున్నారు. ఎస్ఎల్బీసీ ప్రమాదం జరిగితే ఒక మంత్రి పోయి చావల కూర చేపించుకొని తిన్నాడు అని కేటీఆర్ విమర్శించారు.

అధికారం మాత్రమే పోయింది ప్రజల్లో అభిమానం మాత్రం అలాగే ఉంది. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుంది గాడిదని చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుంది. అట్లనే కాంగ్రెస్ కంచర గాడిదలను చూసిన తర్వాతనే ప్రజలకు కేసీఆర్ గొప్పతనం తెలిసి వచ్చింది. కేసీఆర్ ఉన్నప్పుడు వచ్చిన నీళ్లు కాంగ్రెస్ ఉన్నప్పుడు ఎందుకు రావడం లేదని అడిగితే ఏ ఒక్క కాంగ్రెస్ నేత సమాధానం చెప్పడం లేదు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం నుంచి నీళ్ళు రాకపోతే మరిప్పుడు కాంగ్రెస్ కట్టిన ఎస్సారెస్పీ నుంచి నీళ్లు ఎందుకు రావడం లేదు. కేసీఆర్ మీద ఉన్న గుడ్డి ద్వేషంతో మేడిగడ్డ చిన్న పర్రెను రిపేరు చేయించకుండా గోదావరి నీళ్లను ఆంధ్రకు వదిలేస్తున్నారు. కృష్ణానదిలో 36 శాతం నీళ్లను కేసీఆర్ ప్రభుత్వం వాడుకుంది. కానీ ఈ కాంగ్రెస్ సన్నాసుల ప్రభుత్వం 24 శాతం నీళ్లను కూడా వాడుకోలేదు. నీళ్లు వాడుకునే తెలివి లేదు. నీటిని పొదుపు చేసుకునే తెలివి లేదు. చెరువులనునింపే తెలివి లేదు. భూగర్భ జలాలను పెంచే తెలివి లేదు అని కేటీఆర్ మండిపడ్డారు.

కాంగ్రెస్ వైఫల్యాలను బిజెపి ప్రశ్నించదు. బడే భాయ్ మోదీ చోటే భాయ్ రేవంత్ మధ్య ఆ అండర్‌స్టాండింగ్ ఉంది. తెలంగాణకు గొంతుగా బిఆర్ఎస్ ఉండొద్దని కాంగ్రెస్ బీజేపీల ఉమ్మడి లక్ష్యం. కేసీఆర్ తెలంగాణ పక్షం కాంగ్రెస్ బిజెపి ఢిల్లీ పక్షం. రేవంత్ రెడ్డి అవినీతిని ఆధారాలతో సహా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోవడం లేదు. ఒక్కొక్క గ్రామం నుంచి బండ్లు కట్టుకుని వరంగల్ సభకు సూర్యాపేట, ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ప్రజలు తరలి రావాలి. కాంగ్రెస్, బిజెపి గుండెల్లో రైళ్లు పరిగెత్తించాల్సిన సందర్భం ఏప్రిల్ 27.. రొక్కసారి గులాబీ సైన్యం కదం తొక్కాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తన.. స్కూల్ అసిస్టెంట్ పై సస్పెన్షన్ వేటు !

నంద్యాల, మార్చి 20:నంద్యాల జిల్లా పరిధిలోని ప్యాపిలి మండలం లోని ఏనుగుమర్రి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఎం.బొజ్జన్న ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.జనార్దన్ రెడ్డి తెలిపారు.

ప్యాపిలి మండలంలోని ఏనుగుమర్రి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఎం.బొజ్జన్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనందున సంబంధిత ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

విధుల నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించడమే కాకుండా విద్యార్థుల పట్ల అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించినట్లు మండల విద్యాశాఖ అధికారి, డిప్యూటీ విద్యాశాఖ అధికారి తమ నివేదికల్లో వెల్లడించినట్లు కలెక్టర్ తెలిపారు.

బీసీసీఐ కీలక నిర్ణయం.. ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా !!

న్యూఢిల్లీ, మార్చి 20:క్రికెట్ లవర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ మెగా ఈవెంట్ మార్చి 22 నుండి అభిమానులను అలరించనుంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో అమలు చేస్తున్న ఒక ముఖ్యమైన నియమంపై బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది.

కోవిడ్-19 మహమ్మారి సమయంలో, ఆటగాళ్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) బంతిపై లాలాజల వాడకాన్ని (సలైవా యూజ్) నిషేధించింది.

ఈ నిషేధం ఐపీఎల్లో కూడా కొనసాగింది. అయితే, ఇప్పుడు ఐసిసి అధికారికంగా బౌలర్లు బంతిపై తమ సలైవా రుద్దవచ్చని అధికారికంగా ప్రకటించింది.

నేడు ముంబయిలో ఐపీఎల్‌కు సంబంధించిన 10 జట్ల కెప్టెన్లు సమావేశమయ్యారు. ఈ చర్చల సందర్భంగా, చాలా మంది కెప్టెన్లు బంతిపై ఉమ్మివేయడంపై నిషేధాన్ని తొలగించాలని ఐసిసికి సూచించారు. ఐసిసి కూడా ఈ మేరకు తక్షణ నిర్ణయం తీసుకుంది మరియు ఈ సీజన్ నుండి ఆ నియమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ముఖ్యంగా పేస్ బౌలర్లకు పెద్ద ఉపశమనం కలిగిస్తుంది. సలైవా వాడకం బంతికి మెరుగైన స్వింగ్ ఇవ్వడమే కాకుండా రివర్స్ స్వింగ్‌కు కూడా సహాయపడుతుంది.

బెట్టింగ్ నియంత్రణకై ప్రత్యేక నిఘా పెట్టండి.. ఎస్ఐకి మరికల్ యువకమండలి విజ్ఞప్తి

మహబూబ్‌నగర్, మార్చి 20: శనివారం నుండి ప్రారంభమయ్యే ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో యువత బెట్టింగ్‌ల వైపు చూడకుండా బెట్టింగ్ నియంత్రించాలని కోరుతూ ఇవాళ మరికల్ యువకమండలి సభ్యులు మరికల్ ఎస్సై రాముకు వినతి పత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పోలీసులు బెట్టింగ్ నియంత్రణకై ప్రత్యేక నిఘా కార్యక్రమాలను నిర్వహించాలని.. బెట్టింగ్ పాల్పడుతున్న వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరారు.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా యువత బెట్టింగ్ వ్యసనానికి అలవాటు పడి తమ ప్రాణాల మీద తెచ్చుకుంటున్నారని యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి ప్రత్యేక నిదాన ఏర్పాటు చేసి బెట్టింగ్ పాల్పడుతున్న వారి పట్టుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎస్సై మెడికల్ రాము గ్రామాల్లో ఐపీఎల్ సమయంలో ఖచ్చితంగా పోలీసులు నిఘాలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో కానీ ఆఫ్‌లైన్‌లో కానీ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై ప్రత్యేకంగా నువ్వు ఏర్పాటు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు.

బెట్టింగ్ నియంత్రణపై యువకులు ముందుకు రావడం అభినందనీయమని యువకమండలి సభ్యులను ఎస్సై అభినందించారు. గ్రామాల్లో బెట్టింగ్ పాల్పడుతున్నట్టు తెలిస్తే వెంటనే మరికల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డితోపాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

సోదర భావాన్ని పెంపొందించేవి ఇఫ్తార్ విందులు : అనుదీప్

రామవరం, మార్చి 20 : మానవతా విలువలతో మనిషి మహోన్నతుడిగా మారాలన్నదే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం అని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు సంకు బాపన అనుదీప్ అన్నారు. తమ జీవిత సౌధాల్ని సత్యం, న్యాయం, ధర్మం అనే పునాదుల మీద నిర్మింపజేసుకునేందుకు ఉపయోగపడే సాధనమే ఉపవాస వ్రతం అన్నారు. గురువారం సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ మస్జిద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు.

గంగా జమున తెహజీబ్ మన సంస్కృతిలో ఒక భాగం అన్నారు. కానీ నేడు కొందరు మతాల మధ్య విద్వేషం సృష్టించి లాభపడాలని చూస్తున్నారని, అది మంచి పద్ధతి కాదన్నారు. పండుగలు ఏవైనా అందరం కలిసికట్టుగా చేసుకుంటేనే బాగుంటుందన్నారు. తమ పార్టీ ఎప్పటికీ సెక్యులర్ పార్టీ అన్నారు. 30 రోజుల పాటు ఉపవాస దీక్షను చేస్తున్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అందరు బాగుండాలి అందులో మనం ఉండాలి అనే నానుడిని అందరూ అలవర్చుకుంటే బాగుంటుందని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడెల్లి యాకయ్య, కలకోటి ఐలయ్య, బావు సతీశ్, అజార్, ఉమర్ జమాతే ఇస్లామియా హింద్ సభ్యుడు అబ్దుల్ బషీద్, కరీం, సోను సాబ్, యాకూబ్, సమీర్, షాకీర్ పాల్గొన్నారు.

ఆన్లైన్ గేమింగ్ వ్యసనం కట్టడికి ప్రభుత్వ చర్యలు

న్యూఢిల్లీ, మార్చి 20:వినియోగదారులకు సురక్షితమైన విశ్వసనీయ ఇంటర్నెట్ సేవలను అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వివిధ విధానాలను అమలు చేస్తోంది.

ఈ లక్ష్య సాధన దిశగా, సంబంధిత వర్గాలతో చర్చించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం 2021 ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిబంధనలను (తాత్కాలిక మార్గదర్శకాలు. డిజిటల్ మీడియా నైతికత నిబంధనలు), 2000 సంవత్సర ఐటీ చట్టాన్ని అనుసరించి సవరించింది. ఆన్లైన్ గేమింగ్ ద్వారా ఉత్పన్నమయ్యే వివిధ సామాజిక, ఆర్థిక అంశాలను ఈ సవరణలు పరిష్కరించగలవని భావిస్తున్నారు. ఆన్లైన్ గేమింగ్ లో అపాయాలు పొంచి ఉంటాయని, గేమింగ్ వ్యసనంగా మారే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వానికి తెలుసు.

ఆన్లైన్ గేమ్స్ కు సంబంధించి గేమింగ్ సంస్థలు, మధ్యవర్తులు, సామాజిక మాధ్యమ భాగస్వాములు, వేదికలపై 2021 ఐటీ నిబంధనల చట్టం కొన్ని పరిమితులు విధించింది. సంబంధిత చట్టాలు అమల్లో ఉన్న సమయంలో ఆయా సంస్థలు వాటిని అతిక్రమించే ఎటువంటి సమాచారాన్ని ప్రసారం చేయడం, భద్రపరచడం లేదా ప్రచురించడం కానీ చేయరాదు. తదనుగుణంగా పిల్లలకు హాని చేసే, లేదా మనీ లాండరింగ్, జూదాలకు సంబంధించిన ఎటువంటి ఫిర్యాదులు అందినా, లేదా 2021 ఐటీ నిబంధనల ప్రకారం చట్టవిరుద్ధమనదగ్గ సమాచారాన్ని ఆయా సంస్థలు విధిగా తొలగించవలసి ఉంటుంది. తద్వారా జవాబుదారీతనానికి కట్టుబడి ఉండాలి.

దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, రక్షణ, భద్రత, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా లేదా వీటన్నిటికీ విఘాతాన్ని కలిగించే చర్యలను అడ్డుకునేందుకు నిర్దిష్ట సమాచారం, లింక్ లను కట్టడి చేయాల్సిందిగా మధ్యవర్తులకు ఆదేశాలు జారీ చేసే నిబంధనలను 2009 ఐటీ చట్టం(సమాచార నిరోధానికి సంబంధించిన విధివిధానాలు, జాగ్రత్తలు) కలిగి ఉంది.

ఆన్లైన్ గేమింగ్, బెట్టింగ్, జూదాలను అడ్డుకునేందుకు 2022-24 మధ్య, మొబైల్ యాప్ లు సహా 1298 సైట్లకు వ్యతిరేకంగా ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ నిరోధక ఉత్తర్వులను జారీ చేసింది.

కేంద్ర హోం మంత్రిత్వశాఖ కింద పనిచేసే నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ), "క్రైమ్ ఇండియా" పత్రికలో నేరాలకు సంబంధించిన గణాంకాలను ప్రచురిస్తుంది. అయితే, ఆన్లైన్ గేమింగ్ కు సంబంధించి జరిగే ఆత్మహత్యల గణాంకాలను మాత్రం ఎన్సీఆర్బీ నిర్వహించదు.

రైల్వేలు, సమాచార, ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల కేంద్రమంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ ఈ విషయాలను లోక్ సభలో ఈరోజు వెల్లడించారు.

మా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి.. అడ్మిషన్స్ కోసం వినూత్న ఆలోచన

అమరావతి, మార్చి 20:మండల పరిధిలోని పెద్దచింతకుంట గ్రామ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌ను పెంచేందుకు సిబ్బంది వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది నిష్ణాతులైన అధ్యాపకులచే బోధన, డిజిటల్ తరగతులు, ఆధునిక ప్రయోగశాలలు మా కళాశాలలో ఉన్నాయంటూ.. మా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండంటూ వినూత్నంగా ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థులకు కరపత్రాలను అందజేస్తూ కోరడం జరిగింది.

నర్సాపూర్‌లో ఇంటర్ పరీక్షలు రాసి బయటకు వచ్చిన విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేస్తూ తమ కళాశాలలో చేరాలంటూ ప్రచారం చేశారు. కళాశాలలో గల ప్రత్యేకతలను విద్యార్థులకు తెలియజేస్తూ అడ్మిట్ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సమీరా, సురేశ్‌కుమార్, అదెప్ప, రమేశ్, శ్రీనివాస్, ఆరీఫ్, మహేందర్‌రెడ్డి, రాజు, రాము పాల్గొన్నారు.

సాధారణంగా ప్రవేట్ విద్యా సంస్థలకు చెందిన సిబ్బంది ఇలా చేస్తుండటం చూస్తుంటాం. అయితే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం సరికొత్తగా ప్రయత్నిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది.

జగన్ ఆంధ్రా సద్దాం హుస్సేన్: నారా లోకేష్

అమరావతి, మార్చి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: వైసీపీ నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనను తాను ఏపీ సద్దాం హుస్సేన్ గా ఊహించుకున్నారు.. 30 ఏళ్ల పాటు పదవిలో కొనసాగుతానని కలలు కన్నారంటూ టీడీపీ నాయకుడు, మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. రుషికొండలో నిర్మించిన విలాసవంతమైన ప్యాలెస్ పై స్పందిస్తూ.. పైవిధంగా వ్యాఖ్యానించారు. రుషికొండ ప్యాలెస్ గురించి నారా లోకేష్ మాట్లాడుతూ.. 'తొలుత ఇది ఏపీ ప్రభుత్వ పర్యాటక శాఖ ప్రాజెక్ట్.. తర్వాత అది శీష్ మహల్ గా మారింది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనను తాను ఏపీ సద్దాం హుస్సేన్ గా భావించారు. అందుకే మరో 30 ఏళ్ల పాటు తానే పదవిలో ఉంటానని నమ్మి.. అంత విలాసవంతమై భవనాన్ని నిర్మించారు' అని చెప్పుకొచ్చారు. లోకేష్ మాట్లాడుతూ.. 'మా తాత, నాన్న ఇద్దరు ముఖ్యమంత్రులుగా పని చేశారు. కానీ వారి హయాంలో నేను ఇంత విలాసవంతమైన భవనాన్ని, ఇంత పెద్ద గదులను చూడలేదు. శీష్ మహల్ నిర్మాణం కారణంగా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ రాష్ట్ర ప్రభుత్వం మీద 200 కోట్ల రూపాయల జరిమానా విధించింది' అని తెలిపారు. 'వైసీపీ అధ్యక్షుడిది చాలా చిన్న కుటుంబం. ఆయన తల్లి, సోదరిలను కుటుంబం నుంచి పంపించి వేశారు. ప్రస్తుతం ఆయన, భార్య, పిల్లలు మాత్రమే ఉన్నారు. కేవలం నలుగురు కుటుంబ సభ్యుల కోసం 700 కోట్ల రూపాయల ఖర్చు చేశారు. ఆఖరికి ప్రధాన మంత్రి కూడా ఇంత పెద్ద ఇంట్లో నివాసం ఉండరు' అని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం ఆ భవనాన్ని ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై ఆలోచనలు చేస్తుంది అని తెలిపారు.

భారత్ దాల్ పథకంలో భాగంగా వినియోగదారులకు రాయితీ ధరకు పెసర పప్పు

న్యూఢిల్లీ, మార్చి 20:వినియోగదారులకు వారు భరించగలిగినంత చౌక ధరలలో పప్పులను అందుబాటులో ఉంచేటట్లు చూడడానికి 2023 జులై నెలలో పీఎస్ఎఫ్ లోని చనా (సెనగల) నిల్వను చిల్లర విక్రయాల నిర్వహణ నిమిత్తం సెనగ పప్పుగా మార్చివేసి, భారత్ దాల్‌ను ప్రారంభించారు. భారత్ చనా దాల్ ను ఒక కిలో ప్యాక్‌ను రూ.60, 30 కేజీల ప్యాక్ రూపంలో అయితే ఒక కిలో రూ.55 ధర చొప్పున సబ్సిడీ ధరలలో రిటైల్ కస్టమర్లకు అమ్మారు. భారత్ చనా దాల్ ఒకటో దశలో రిటైల్ కస్టమర్లకు 12.32 లక్షల మెట్రిక్ టన్నుల భారత్ సెనగపప్పును విక్రయించారు. భారత్ దాల్ అమలులో సహకరిస్తున్న ఏజెన్సీలు దేశవ్యాప్తంగా 172 నగరాల్లో 25023 విక్రయకేంద్రాలు, సంచార వ్యాన్ల ద్వారా భారత్ సెనగపప్పును పంపిణీ చేశారు.

దీనికి అదనంగా, భారత్ (చనా) దాల్ రెండో దశలో భాగంగా, రిటైల్ పంపిణీ కోసం 3 లక్షల ఎంటీ సెనగ పప్పును కూడా కేటాయించారు. ఈ తరహాలో కేటాయించిన సెనగ పప్పును పప్పు రూపంలోనూ, పూర్తి రూపంలోనూ.. ఒక కిలో ప్యాక్‌కయితే సెనగపప్పును ఒక కిలో రూ.70 గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ), పూర్తి రూపంలో (చనా హోల్) అయితే ఒక కిలో రూ.58 ఎంఆర్‌పీ పై అమ్ముతున్నారు. ఈ సంవత్సరంలో ఈ నెల 12 వరకు 1.18 లక్షల మెట్రిక్ టన్ను (ఎల్ఎంటీ)ల సెనగ పప్పు, 13.495 మెట్రిక్ టన్నుల పూర్తి రూపంలో చనా విక్రయాలు నమోదయ్యాయి. భారత్ దాల్ ఒకటో దశలో భాగంగా, 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 3051 స్థిర దుకాణాలలో, 8939 మొబైల్ వ్యాన్లు, 9 ప్రధాన ఈ-కామర్స్ వేదికల ద్వారానూ భారత్ పప్పుల పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

భారత్ దాల్‌ను విస్తరించారు. పీఎం టీఎఫ్ ఆపద్ధర్మ నిల్వలో అట్టిపెట్టిన పెసర్లను పెసర పప్పుగా మార్చి భారత్ మూంగ్ దాల్ (భారత్ పెసర పప్పు)గా పేరు పెట్టారు. రాయితీ ధరలలో వినియోగదారులకు చిల్లర విక్రయాలు జరపాలనేది ముఖ్యోద్దేశం. ఇంతేకాకుండా భారత్ దాల్‌ను మరింతగా విస్తరించి, మసూర్ దాల్ (ఎర్ర కందిపప్పు లేదా మైసూర్ పప్పు అని కూడా అంటారు) ను కూడా దీని పరిధిలోకి తీసుకువచ్చారు. పీఎస్ఎఫ్ బఫర్‌లో ఉంచిన మసూర్ నిల్వను మసూర్ దాల్‌గా మార్చి కిలో రూ.89 చిల్లర విక్రయ ధరకు వినియోగదారులకు ఇవ్వాలనేదే ఉద్దేశం. భారత్ సెనగ పప్పు ఒకటో దశ అసెస్‌మెంటును క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పూర్తి చేసింది. భారత్ దాల్ పంపిణీలో సాధ్యమైనంత ఎక్కువ సమాచారాన్ని తెలుసుకోవడానికి, ఏజెన్సీలను క్రమం తప్పక భారత్ దాల్ పంపిణీ స్థితిగతులను ఎప్పటికప్పుడు ఫోటోల రూపంలో నమోదు చేస్తూ ఉండాల్సిందిగాను, రోజువారీ అమ్మకాల్లో ప్రగతిని విభాగానికి తెలియజేయాల్సిందిగాను ఆదేశాలిచ్చారు. నిలవల కదలిక, అమ్మకాల్లో పురోగతి, నిర్వహణ సంబంధిత సవాళ్ల పరిష్కారం కోసం నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీసీఎఫ్), నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్), కేంద్రీయ భండార్‌లతో నిర్దిష్ట కాలాల్లో సమావేశాలను నిర్వహిస్తున్నారు.

రెండో దశలో భాగంగా భారత్ బ్రాండ్ పప్పుల పంపిణీని నాఫెడ్, కేంద్రీయ భండార్, ఎన్‌సీసీఎఫ్.. ఈ మూడు కేంద్రీయ సహకార సంస్థలూ వాటి సొంత దుకాణాలు, మొబైల్ వ్యాన్లు, ఈ-కామర్స్ వేదికలతోపాటు పెద్ద స్థాయి చిల్లరవిక్రయ దుకాణ శాఖల ద్వారా కూడా చేపడుతున్నాయి.

విహారయాత్రలో విషాదం..

అమరావతి, మార్చి 20 జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న శ్రీశైలం పాతాళ గంగలో స్నానానికి దిగి ఓ యువకుడు మరణించిన ఘటన చోటుచేసుకుంది. మృతుడు కరీంనగర్ కు చెందిన సాయి తేజ(18)గా గుర్తించారు పోలీసులు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరా బాదు ఉప్పుగూడా బాయ్స్ హాస్టల్ లో ఉంటూ కులీకుతుబ్ షా కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతున్న సాయి తేజ. ఐదుగురు మిత్రులతో కలసి విహార యాత్రలో భాగంగా గురువారం శ్రీశైలం చేరుకుని పాతాళ గంగలో స్నానా మాచరించడానికి నదిలో దిగి ప్రమాదవశాత్తు మృతిచెందాడు.

స్పామ్ కాల్స్‌ను అదుపులో పెట్టిన ట్రాయ్

న్యూఢిల్లీ, మార్చి 20:టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్ (టీసీసీసీపీఆర్), 2018ని భారతీయ టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) ఈ ఏడాది ఫిబ్రవరి 12న సవరించింది. దీనిలో ఇతర అంశాలతోపాటు ఈ కింది నిబంధనలను పొందుపరిచారు: ఏ వినియోగదారైనా స్పామ్‌ను గాని, లేదా తాను కోరని తరహాకు చెందిన వాణిజ్య వర్తమానాన్ని (అన్‌సొలిసిటెడ్ కమర్షియల్ కమ్యూనికేషన్..యూసీసీ) గాని అందుకొంటే అలా అందుకున్న 7 రోజుల లోపల ఫిర్యాదు చేయవచ్చు. ఇంతకు ముందు ఇలా ఫిర్యాదు చేయడానికి 3 రోజుల వ్యవధి మాత్రమే ఉండేది.

నమోదు చేసుకోకుండానే సందేశాలను పంపిస్తే (అన్ రిజిస్టర్డ్ సెండర్స్), ఆ పని చేసిన వర్గాలపై యూసీసీకి గాను చర్య తీసుకోవడానికి యాక్సెస్ ప్రొవైడర్లకు 30 రోజుల వ్యవధి ఉండగా ఈ వ్యవధిని 5 రోజులకు తగ్గించేశారు.

యూసీసీని పంపించే వర్గాలపై వెంటనే చర్య తీసుకొనేటట్లు చూడడానికి, ఆ వర్గాలపై కార్యాచరణ చేపట్టడానికి అనుసరించాల్సిన ప్రమాణాన్ని సవరించి కఠినతరం చేశారు. .ఇదివరకు సెండరుకు వ్యతిరేకంగా గడచిన 7 రోజులలో 10 ఫిర్యాదుల' కొలబద్ధను పాటిస్తుండగా దీనిలో మార్పు చేసి, 'గత 10 రోజులలో సెండరుకు వ్యతిరేకంగా 5 ఫిర్యాదుల' కొలమానాన్ని ప్రవేశపెట్టారు.

ఈ సవరణలు అధికారిక రాజపత్రం (అఫీషియల్ గెజిట్)లో ప్రచురించిన తేదీ నుంచి 30 రోజులైన తరువాత అమలులోకి వస్తాయి. అయితే, వీటిలో నుంచి రెగ్యులేషన్ 8, రెగ్యులేషన్ 17ను, రెగ్యులేషన్ 20లోని సబ్-క్లాజులు (ఎ), (బి)లతో పాటు, రెగ్యులేషన్ 21లోని సబ్-క్లాజ్ (బి)ని మాత్రం మినహాయించారు. ఈ నియమాలు అధికారిక రాజపత్రంలో ప్రచురణ అనంతరం 60 రోజులు గడిచాక అమలులోకి వస్తాయి. ఇంతేకాకుండా, స్పామ్ కాల్స్ చేయడానికి ఉపయోగిస్తున్న సెండర్లు, అన్ రిజిస్టర్డ్ టెలిమార్కెటర్ల (యూటీఎంల)కు చెందిన టెలికాం వనరులన్నిటినీ డిస్‌కనెక్ట్ చేయాల్సిందిగాను, ఆ తరహా సెండర్లను 'బ్లాక్ లిస్టు'లో చేర్చాల్సిందిగాను ట్రాయ్ 2024 ఆగస్టు 13న ఆదేశాలిచ్చింది.

యాక్సెస్ ప్రొవైడర్లు విస్తృత చర్యలు చేపట్టారు. ఫలితంగా, యూటీఎంలకు వ్యతిరేకంగా అందే ఫిర్యాదులు చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గాయి. కిందటి ఏడాది ఆగస్టులో ఈ తరహా ఫిర్యాదులు 1,89,419 రాగా, ఈ ఏడాది జనవరిలో ఈ తరహాకు చెందిన 1,34,821 ఫిర్యాదులే వచ్చాయి. వ్యక్తులను, సంస్థల (ఎన్టిటీల)ను కలిపి 1150కన్నా ఎక్కువగా 'బ్లాక్ లిస్ట్'లో చేర్చడంతోపాటు 18.8 లక్షల టెలికాం వనరులను డిస్‌కనెక్ట్ చేశారు.

ఈ సమాచారాన్ని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ ఈ రోజు లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలియజేశారు.

తాను మరణించినా నేత్రాలు సజీవం...

కరీంనగర్, మార్చి 20: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన కిన్నెర మల్లయ్య (56) బుధవారం రాత్రి మానకొండూర్ మండలం శంషాబాద్ వద్ద జరిగిన రోడ్ ప్రమాదం లో మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు మృతుని నేత్రాలను ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి కి దానం చేసారు. తన తండ్రి చనిపోయినా మరొకరి జీవితానికి నేత్రాలు ఉపయోగపడాలనే ఆశయం తో తన తండ్రి నేత్రాలను దానం చేసినట్లు మల్లయ్య కొడుకు అనిల్ పేర్కొన్నారు. అనిల్ చేసిన ఈ గొప్ప కార్యక్రమం అవయవ దానం స్ఫూర్తి ని కలిగిస్తుందని గ్రామస్తులు అభినందించారు. గురువారం జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రస్తుతం అనిల్ బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గా వ్యవహరిస్తున్నారు.

జేఎన్టీయూహెచ్‌లో చలివేంద్రాల ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 20:యూనివర్సిటీలో విద్యార్థుల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థి సంఘం నేతలు రాహుల్ నాయక్, దుర్గా ప్రసాద్‌లు తెలిపారు. గురువారం జేఎన్టీయూహెచ్ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద? స్పందన బ్లాక్ వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో ఎండవేయడమి నుంచి ఉపశమనం పొందేందుకు తరచుగా తాగునీటిని తాగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు? వివిధ అవసరాల కోసం యూనివర్సిటీకి వచ్చే వారికోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే యూనివర్సిటీలో తాగునీటి ప్లాంట్లను రిపేరు చేయించి ప్రతి బిల్డింగ్‌లో? ప్రతి ఫ్లోర్‌లో తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు సాగర్ నాయక్ నితిన్ కుమార్, సంతోష్ కుమార్, భాను ప్రకాష్, హరినాథ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో బీజేపీకి భారీ షాక్.. పలువురు సీనియర్లు రాజీనామా..!

హైదరాబాద్, మార్చి 20:చిలకా నగర్ డివిజన్ నాయకుల ప్రమేయం లేకుండా డివిజన్ అధ్యక్ష పదవిని ఏకపక్షంగా ప్రకటించినందుకు నిరసనగా బీజేపీ సీనియర్లు తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. పార్టీ ప్రకటించిన డివిజన్ అధ్యక్షుడి ఎంపికను తాము అంగీకరించే ప్రసక్తి లేదని నాయకులు తేల్చిచెప్పారు. సీనియర్ నాయకుల సూచనలు, సలహాలు తీసుకోకుండా, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించకుండా డివిజన్ అధ్యక్ష ఎన్నిక జరిగిన విధానాన్ని సహించేది లేదని సీనియర్ బీజేపీ నాయకులు తేల్చిచెప్పారు. అదే విషయాన్ని స్పష్టం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్ నాయకులందరి నిర్ణయం మేరకు అధ్యక్షుడి ఎంపిక జరగాల్సిందే అని పేర్కొన్నారు. తమ సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర పార్టీ నుంచి వచ్చిన అధ్యక్ష ఎంపిక ప్రక్రియను సహించేది లేదన్నారు. తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల చిలకానగర్ డివిజన్ సీనియర్లంతా పదవులకు రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి ఆచారి, రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర బీజేపీ సంఘటన్ మంత్రి చంద్రశేఖర్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్‌కు ఇప్పటికే వినతిపత్రాలు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. నామినేషన్ ప్రక్రియ జరిగిన రోజున సంబంధిత వ్యక్తి హాజరు కాలేదని, పైగా ఎన్నికలలో భాగమైన బూత్ కమిటీ అధ్యక్షులు జాబితా జారీ చేయలేదన్నారు. ఎన్నికల అధికారిని బెదరించి, కొంతమంది రాజకీయ నాయకుల ప్రభావం చేత ఎన్నిక చేయడం దుర్మార్గని సీనియర్లు పేర్కొంటున్నారు. పార్టీ నియమావళికి విరుద్ధంగా జరిగిన ఎన్నికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీనియర్లు ప్రకటించారు.

భద్రాద్రి ఆలయంలో పనిచేయని లిఫ్ట్.. వృద్ధులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు

భద్రాచలం, మార్చి 20 : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో లిఫ్ట్ పనిచేయడం లేదు. దీంతో స్వామివారి దర్శనానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం దర్శనానికి వచ్చిన దివ్యాంగులు, వృద్ధులు లిఫ్ట్ సౌకర్యం లేకపోవడంతో రామయ్యను దర్శించుకునేందుకు నానా అవస్థలు పడ్డారు.

లిఫ్ట్ గతంలో సైతం మరమ్మతులకు గురైంది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. కాగా లిఫ్ట్ మరోసారి పనిచేయకుండా పోయింది. దీంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయ నిర్వాహకులపై దివ్యాంగులు, వృద్ధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా లిఫ్ట్ మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతర పోరాటం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 20:అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకా నగర్ డివిజన్‌లో సుమారు కోటి రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్, మాజీ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి గురువారం ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడానికి తన వంతు కృషి చేస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి నిధులను తీసుకువస్తామని పేర్కొన్నారు. కాలనీ వాసుల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కాలనీలో డ్రైనేజీ, నీటి కొరత సమస్యలు లేకుండా నిధులు తీసుకువచ్చి పనులు చేపట్టే విధంగా చూస్తామని అన్నారు. డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో నిధులు తీసుకువస్తున్నామని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు. డివిజన్ అభివృద్ధిలో కాలనీవాసులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బీఆర్ఎస్ నేతలు కొండల్ రెడ్డి, జెల్లి మోహన్, మధుసూదన్ రెడ్డి, పల్లె నర్సింగరావు, కోకొండ జగన్, రవీందర్ రెడ్డి, పిట్టల నరేష్, కొంపెల్లి రవీందర్ కొంపెల్లి రాజు, రాజ్ కుమార్, బొల్లం లక్ష్మణ్, అల్లిబిల్లి మహేందర్, మాస శేఖర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమలకు మొండి చెయ్యి.. కాంగ్రెస్ బడ్జెట్‌పై నేతన్నల ఫైర్

హైదరాబాద్, మార్చి 20:రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో చేనేత, పవర్ లూమ్ పరిశ్రమలు, కార్మికుల అభివృద్ధి కోసం కేవలం రూ. 371 కోట్లు నామమాత్రంగా కేటాయించి చేనేతకు కాంగ్రెస్ మొండిచేయి చూపిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో చేనేత రంగానికి తగినన్ని నిధులు కేటాయించనందుకు.. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా గురువారం తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మన్సురాబాద్ డివిజన్, సహారా స్టేట్స్ కాలనీ మొదటి గేటు వద్ద ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా వనం శాంతి కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేత కుటుంబాలను అభివృద్ధి చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కిందన్నారు. చేనేత, పవర్ లూమ్ కార్పొరేషన్లను ఏర్పాటు చేయడంతోపాటు రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న సిరిసిల్ల, వరంగల్, మల్కాపూర్, గుండ్ల పోచంపల్లి టెక్స్‌టైల్ పార్కులను అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులు జరపలేదన్నారు. చేనేత, పవర్‌లూమ్ పరికరాలకు 90 శాతం సబ్సిడీ అందిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమ, కార్మికుల అభివృద్ధి పై ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలంటే రూ.2000 కోట్లు కేటాయించాల్సి ఉండగా ఇందులో కేవలం రూ. 371 కోట్లు మాత్రమే నామమాత్రంగా కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. చేనేత అభివృద్ధి కోసం బడ్జెట్లో కేటాయించిన రూ. 371 కోట్లతో గతంలో ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేస్తారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉండే త్రిఫ్ట్ పథకాన్ని పునరుద్ధరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మీనామేషాలు లెక్కపెడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి కార్మికులకు ఉపాధి లేక సుమారు 300 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రాష్ట్రంలో ఉపాధి లేక వేలాదిమంది కార్మికులు కుటుంబాలను వదిలి వలసలు పోయారని ఇలాంటి దారుణ పరిస్థితిలో కార్మికులను ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం లేకుండా బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. ఓట్లు, సీట్లు, అధికారం కోసం హామీలు ఇవ్వడమే తప్ప కార్మికులకు ఉపాధి కల్పించి సంక్షేమ పథకాల ద్వారా అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదని బడ్జెట్లో కేటాయింపులను చూస్తే అర్థమవుతుందన్నారు. చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమ, కార్మికుల అభివృద్ధి కోసం బడ్జెట్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ చేనేత కార్మిక సంఘం త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను నిర్వహిస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షుడు వర్కాల చంద్రశేఖర్, నాయకులు పెంటయ్య, శేఖరయ్య, గజం శ్రీశైలం, వల్లకాటి వెంకటేష్, గుండు గోవర్ధన్, చెరుపల్లి రవికుమార్, తిరందాస్ జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఇంటి పన్ను సమస్యను పరిష్కరించాలి..

హైదరాబాద్, మార్చి 20: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధించిన అదనపు పన్ను సమస్యను పరిష్కరించాలని 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు అదనపు ఇంటి పన్ను విధింపుతో మధ్యతరగతి కుటుంబాలు ఆ భారాన్ని చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని డివిజన్ మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ దృష్టికి తీసుకువచ్చారు.

దీంతో సమస్యపై వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్ కాలనీ ప్రజలతో కలిసి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ సాబేర్ అలీ మాట్లాడుతూ ఇంటి పన్ను సమస్యపై ఇదివరకే కలెక్టర్‌తో చర్చించామని వచ్చే నెల (ఏప్రిల్)లోపు సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వీరేందర్ రెడ్డితో పాటు కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎం.సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డితో పాటు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఓలా, ఊబర్ క్యాబ్ డ్రైవర్లకు చెల్లించే రేటు పెంచాలి.. డ్రైవర్ల ధర్నా

హైదరాబాద్, మార్చి 20: ఊబర్, ఓలా క్యాబ్ డ్రైవర్స్‌కు చెల్లిస్తున్న ధరను పెంచి తమను ఆర్థికంగా ఆదుకోవాలని ఊబర్, ఓలా క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఓలా, ఊబర్ యాజమాన్యాల తీరుకు నిరసనగా తూంకుంట మున్సిపల్ దొంగల మైసమ్మ శామీర్‌పేట ఓఆర్ఆర్ సర్కిల్ వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓలా, ఊబర్ డ్రైవర్లుగా పని చేస్తున్న మాకు యాజమాన్యాలు సరైన ధరలు చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. మేము ఉన్న స్థలం నుంచి దాదాపు 3 నుంచి 4 కిలో మీటర్ల దూరంలో కస్టమర్స్ ఇస్తున్నప్పటికి తమకు చెల్లించే ధరతో గిట్టుబాటు అవ్వడం లేదన్నారు. తూంకుంట నుంచి శంషాబాద్ ఏయిర్ పోర్టుకు డ్రాప్(గిరాకి) పడితే ఓలా, ఊబర్ యాజమాన్యాలు క్యాబ్ డ్రైవర్లకు కేవలం 300 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా తమకు ఇచ్చే కమీషన్ రేటు పెంచకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ప్రస్తుతం ఇచ్చే ధర తమకు గిట్టుబాటు అవ్వడం లేదని గిరాకి డబ్బులు పెట్రోల్‌కే సరిపోతున్నాయన్నారు. పొద్దంతా కష్టపడితే కనీసం ఈఎంఐలు, ఇంటి కిరాయిలు కట్టలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఓలా, ఊబర్ యాజమాన్యాలు క్యాబ్ డ్రైవర్లకు ఇస్తున్న కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఊబర్, ఓలా క్యాబ్ డ్రైవర్స్ వేణు గోపాల్, శ్రవణ్ కుమార్, శ్రవణ్, శ్రీనివాస్, మహేష్, మనోహర్, విష్ణు, సురేష్, మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో చలివేంద్రాన్ని ప్రారంభించిన జడ్జి

రాజన్న సిరిసిల్ల, మార్చి 20:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ కోర్టులో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టుకు వచ్చే కక్షిదారుల దాహార్తించడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన న్యాయవాదుల సంఘాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్ , ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, విద్యాసాగర్ రావు, గడ్డం సత్యనారాయణ రెడ్డి, గోగికారి శ్రీనివాస్, పెంట రాజు, నక్క దివాకర్, బీమా మహేష్, గొంటి శంకర్, మాదాసు దేవయ్య, రేగుల రాజ్ కుమార్, బొడ్డు గంగరాజు, బొజ్జ మహేందర్, మహేష్, నాగేంద్రబాబు, మహిళా న్యాయవాదులు అన్నపూర్ణ సుజాత తదితరులున్నారు

అత్యాధునిక వెటర్నరీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ 'పెట్ ఫస్ట్' ప్రారంభం



హైదరాబాద్, మార్చి 20:ఎంపుడు జంతువులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కోకాపేట్లోని నార్సింగిలో అత్యాధునిక వెటర్నరీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ 'పెట్ ఫస్ట్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెట్ ఫస్ట్ వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ డైరెక్టర్ పద్మజ మాట్లాడుతూ మా పెట్ 'మాక్స్' నా జీవితంలో ఎంతో ముఖ్యమైన భాగం అన్నారు. పెట్ పేరెంట్‌గా, వ్యాపారవేత్తగా జంతువుల సంరక్షణను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నానన్నారు. ఈ దీక్షే ఆధునిక వెటర్నరీ ఆరోగ్య సంరక్షణ కోసం ఒక అత్యాధునిక కేంద్రాన్ని నిర్మించేందుకు ప్రేరణ ఇచ్చిందన్నారు. పెంపుడు జంతువుల సమగ్ర ఆరోగ్య సంరక్షణ మా లక్ష్యమన్నారు. ఈ హాస్పిటల్‌లో అధునాతన రోగ నిర్ధారణ పరీక్షలు, అత్యవసర సంరక్షణ, ప్రత్యేక చికిత్సలు, వెల్నెస్ కార్యక్రమాలు, పెంపుడు జంతువుల పునరుజ్జీవన కేంద్రం, పెంపుడు జంతువుల శిక్షణ అన్నీ ఒకే చోట గల గమ్యస్థానం అన్నారు. 'పెంపుడు జంతువుల పట్ల ప్రేమ, ఆయా కుటుంబాల పరిరక్షణ' ఇదే మా హామీ అన్నారు.

ఈ సందర్భంగా పెట్ ఫస్ట్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే కే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ సమాజంలో మనుషులను మాత్రమే కాకుండా ప్రతి జీవిని ఆదరించాలన్నారు. అదే దృక్పథంతో పని చేస్తున్నానన్నారు. పెట్ ఫస్ట్ ద్వారా పెంపుడు జంతువులకు తగినంత శ్రద్ధ, వైద్య సేవలు అందే ప్రపంచాన్ని నిర్మించడం తమ లక్ష్యమన్నారు. ఆధునిక సౌకర్యాల ద్వారా వెటర్నరీ చికిత్సా ప్రమాణాలను మెరుగుపరచ డమే కాకుండా, పెంపుడు జంతువుల కు, పెంపుడు జంతువుల యజమానులకు ఉత్తమ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. 24/7 అత్యవసర, క్రిటికల్ కేర్ సేవలు కలవన్నారు. అత్యాధునిక పరీక్షలు, శస్త్రచికిత్స నిపుణులు, పూర్తి స్థాయి పెట్ ఆరోగ్య సంరక్షణ, ప్రపంచ స్థాయి అనుభవం కలిగిన వెటర్నరీ నిపుణుల బృందం కలదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మళ్ళు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్, టూరిజం, సంస్కృతి ఉ పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి శాఖ డీ అనసూయ సీతక్క, మేయర్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రసతరంగిణి
ఆధ్వర్యంలో
అవధాన రాజహంసిని, అవధాన విద్యన్నడే,
అవధాన విద్యాకోకిల, అవధాన విద్యాసురభి
డా. శ్రీమతి బులుసు అపర్ణ గారిచే
అష్టావధానం
విశ్వావసు ఉగాది
30-03-2025, ఆదివారం, సాయంత్రం 5.30.గం. నుండి
వేదిక: తెలంగాణ సారస్వత పరిషత్ హాల్,
కింగ్ కోఠి, తిలక్ రోడ్, బొగ్గులకుంట, హైదరాబాద్
సంచాలకులు: డా. శ్రీమతి. టి.కె. చూడామణి
పృచ్ఛకులు:
నిషిద్ధాక్షరి: డా. ఆచార్య ఫణీంద్ర
సమస్య: శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ
దత్తపది: శ్రీ వి.వి. సత్య ప్రసాద్
వర్ణన: డా.శ్రీమతి వారిజ రాణి
వ్యస్తాక్షరి: శ్రీ డి. వాసుదేవరావు
వార గణనం: శ్రీమతి సరస్వతీ రామశర్మ
ఆశువు: శ్రీ సాధన నరసింహాచార్య
అప్రస్తుత ప్రసంగం: డా. అవుసుల భానుప్రకాశ్
అధ్యక్షులు: శ్రీ చిలకమర్రి కిశోర్
కార్యదర్శి: శ్రీ టి.కె.ఎల్.నరసింహాచర్యులు 6300370954
కోశాధికారి: శ్రీ వంగల రంగనాథ్

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.